
కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్ గారి మృతి విషాదకరం. ప్రజల కోసం నిరంతరం పోరాడిన ఆయన్ని దేశం చిరకాలం గుర్తుంచుకుంటుంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 22.07.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 103 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పెట్టుబడులకు పెద్దపీట

- ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ పరికరాల ఉత్పత్తికి ఏపీ అనుకూలం
- రాయలసీమలో ఇప్పటికే మౌలిక సదుపాయాలు
- 'మేడ్ ఇన్ ఇండియా' లక్ష్యాలు నెరవేరేలా నూతన పాలసీ
- ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ 4.0పై సీఎం సమీక్ష



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాయలసీమలో శ్రీసిటీ, హిందుపూర్, కొప్పర్తి లాంటి చోట్ల ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తికి విస్తృతమైన అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తి చేసేందుకు అనువుగా ఈ ప్రాంతాలకు పెట్టుబడులను ఆకర్షించాలని సీఎం అధికారులను సూచించారు. సోమవారం సచివాలయంలో నూతనంగా రూపొందించిన 'ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ 4.0' పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. 2025-30 ల మధ్య ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా నూతన విధానంపై ముఖ్యమంత్రి చర్చించారు. ఎలక్ట్రానిక్స్ పరికరాల దిగుమతులు తగ్గించటం, దేశీయంగా ఉత్పత్తి పెంపు, ఎగుమతుల లక్ష్యంగా నూతన విధానానికి రూపకల్పన చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. గత ఏడాది దేశంలో 70 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్ సర్క్యూట్ బోర్డులు దిగుమతి అయ్యాయని ఈ రంగంలో భారీగా డిమాండ్ ఉందని అధికారులు తెలపగా.... ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల రంగంలో సెల్ఫ్ రిలయన్స్ , మేడ్ ఇన్ ఇండియా లక్ష్యాలు నెరవేరాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. అయితే అంతర్జాతీయ స్థాయి డిమాండ్‌ను తీర్చేందుకు వీలుగా ఏపీలో భారీస్థాయిలో ఎలక్ట్రానిక్స్ పరికరాలు మిగతా 2లో...

## ఫ్రీ బస్సు.. జీరో ఫేర్ టిక్కెట్

- మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వివరాలతో టిక్కెట్ల జారీ
- రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు
- ఆగస్ట్ 15 నుంచి పథకం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



మిగతా 2లో...



## ఉప రాష్ట్రపతి రాజీనామా

**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంటు వర్షాకాల సమావేశాల వేళ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. వైద్య పరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజే ధన్‌ఖడ్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 2022 ఆగస్టులో ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

"ఆరోగ్య సంరక్షణతో పాటు వైద్యుల సలహాలను పాటించేందుకు వీలుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నాను. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. నా పదవీ కాలంలో మద్దతుగా నిలిచిన రాష్ట్రపతి, ప్రధాని, పార్లమెంటు సభ్యులందరికీ కృతజ్ఞతలు. వారి నుంచి లభించిన అమూల్యమైన సహకారం, ఆప్యాయతలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. పదవీకాలంలో ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నాను. అనేక అనుభవాలను మూటగట్టుకున్నాను. ఈ పరివర్తనాత్మక సమయంలో ఉపరాష్ట్రపతిగా.. దేశ ఆర్థిక పురోగతిని, మిగతా 2లో...

## కేరళ మాజీ సీఎం కన్నుమూత



**తిరువనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** కమ్యూనిస్టు కురువృద్ధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి. ఎస్. అచ్యుతానందన్(101) కన్నుమూశారు. గత నెల 23న గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. 2006 నుంచి 2011 వరకు ఆయన కేరళకు సీఎంగా పనిచేసిన విషయం తెలిసిందే. అవిభక్త వామపక్ష పార్టీలో చీలిక తర్వాత సీపీఎంను స్థాపించిన వ్యక్తుల్లో అచ్యుతానందన్ కూడా ఒకరు. 1923 అక్టోబరు 20న కేరళలో వెనకబడిన ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్.. లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు.. ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలకఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేత.

**కార్మిక ఉద్యమాల్లోంచి.. ప్రజా నేతగా.. :** బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేసి... దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ.. జీవనం సాగించిన అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టారు. 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. స్వాతంత్ర్యానికి ముందున్న ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో ఆరంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా ప్రజా నేతగా ముఖ్యమంత్రి స్థాయికి చేరింది. 1964లో సీపీఐ జాతీయ కౌన్సిల్‌ను వదిలేసి.. సీపీఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 దాకా కేరళ అసెంబ్లీకి మిగతా 2లో...

## అజ్ఞాతంలోకి పేర్ని నాని..



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జులై 8న పామర్రులో మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని రప్పా రప్పా అంటూ కొట్టిన డైలాగులు ఇంకా ఆయనను వెంటాడుతూనే ఉన్నాయి. ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రప్పా రప్పా అని చెప్పడం కాదు.. రాత్రికి రాత్రి చేసేయాలంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. హైకోర్టులోనూ ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించినా చుక్కెదురు కావడంతో పేర్ని నాని ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మిగతా 2లో...

## మూడేళ్లలో అమరావతి నిర్మాణం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వం అమరావతి రైతులతో పాటు కాంట్రాక్టర్లను కూడా అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు మంత్రి నారాయణ...అమరావతి నిర్మాణం మూడేళ్లలో ఖచ్చితంగా పూర్తిచేసి తీరుతామని మంత్రి మరోసారి స్పష్టం చేసారు..ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు.రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను సీఆర్డీఏ ఇంజినీర్లతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు...మంత్రులు,హైకోర్టు న్యాయమూర్తులు,ముఖ్య కార్యదర్శులు,కార్యదర్శుల బంగ్లాలతో పాటు ఆలిండియా సర్వీస్ అధికారుల క్వార్టర్ల నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ఆయా నిర్మాణాలకు సంబంధించి మిగతా 3లో...

## సీసీటీవీ కెమెరాలు తప్పనిసరి

CBSE

**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పాఠశాలల్లో భద్రతను మరింతగా బలోపేతం చేసేందుకు సీబీఎస్ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని పాఠశాలల్లో హై రిజల్యూషన్‌తో కూడిన సీసీటీవీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ మేరకు గత నిబంధనను సవరిస్తూ తన పరిధిలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలకు సీబీఎస్ఈ కార్యదర్శి హిమాన్షు గుప్తా లేఖ రాశారు. దీని ప్రకారం.. అన్ని పాఠశాలల్లోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, లాబీలు, కారిడార్లు, మెట్లు, మిగతా 2లో...

## విచారణకు అంబటి , రజిని



**సత్తెనపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. జగన్ రెంటపాళ్ల పర్యటనలో ఆయన బారికేడ్లను తోసి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆయనపై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జగన్ పర్యటన నేపథ్యంలో 113 మంది వైకాపా నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మిగతా 2లో...

## ఆస్పత్రిలో చేరిన తమిళనాడు సీఎం..!



**తమిళనాడు(జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ఉదయం స్వల్ప అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. ఆయన రోజువారీలో భాగంగా ఉదయపు నడకలో ఉండగా.. కళ్లు తిరిగినట్లు అనిపించింది. దీంతో వైద్య పరీక్షల నిమిత్తం చెన్నై అపోలో మిగతా 2లో...

● వివరాలు 3 లో

## పాఠశాలపై కూలిన యుద్ధ విమానం..



## జస్టిస్ వర్మను తొలగించాలి



## ప్రజాభివృద్ధే టీడీపీ ఆకాంక్ష



**పెందుర్తి (జర్నలిస్ట్ ఫైల్) :** పెందుర్తి మండలం గుర్రంపాలెం గ్రామంలో పెందుర్తి తెదేపా ఇంచార్జ్ గండి బాబ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి తెలుగు దేశం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి తెదేపా వర్గీయులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో మంత్రి విస్తృతంగా పర్యటించి ప్రజలకు అందుతున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు పొందుపరిచిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా... లేదా అని అడిగి వివరంగా తెలుసుకోగా ప్రతి ఒక్కరూ తమకు పథకాలు ద్వారా లబ్ది చేకూరిందని, కూటమి పాలనతో మా బ్రతుకులు మారాయని చెప్పడంతో మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మిగతా 2లో...




# పెట్టుబడులకు పెద్దపీట



(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాల్సి ఉందని సీఎం స్పష్టం చేశారు. అదే సమయంలో ఉత్పత్తి చేసిన పరికరాలకు బ్రాండ్‌ను సృష్టించటం అనేది కీలకమైన అంశమని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ విస్తృత ఉత్పత్తికి ఆస్కారం ఇచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఉత్పత్తికి అనువైన ఎకో సిస్టంను కూడా ఏర్పాటు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 100 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులను ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆకర్షించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ప్రస్తుతం ఈ రంగంలో బెంగుళూరు, చెన్నై లాంటి నగరాల్లో భూమి లభ్యత తీవ్రంగా ఉందని ఏపీకి ఇది సానుకూల అంశమని... రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ పరిశ్రమల్ని స్థాపించేందుకు అనుకూల ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. తిరుపతి సమీపంలోని శ్రీసిటీ, కర్నూలు సమీపంలో ఓర్వకల్లు, కొప్పర్తి, హిందూపూర్ లాంటి ప్రాంతాలు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయని స్పష్టం చేశారు. వీటితో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల్ని ప్రోత్సహించేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రతీ ఇంటికీ ఓ పారిశ్రామిక వేత్త ఉండాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు.

**మూడు రీజియన్లు ఐటీ కంపెనీలకు అనుకూలం**

విశాఖ, అమరావతి, తిరుపతి నగరాల్లో ఐటీ కంపెనీల ఏర్పాటుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాంతాల్లో 500 ఐటీ కంపెనీలకు కేటాయించటం ద్వారా ఒకేసారి ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. విశాఖలో ఐటీ ఐటీఈఎస్ సంస్థలతో పాటు లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకూ మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చని అన్నారు. ఈ ప్రాంతాల్లో కోవర్కింగ్ స్పేస్‌లను కూడా ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. విశాఖ, విజయవాడలతో పాటు రాష్ట్రంలోని మిగతా నగరాల్లోనూ ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చూడాలని సీఎం అధికారులకు సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం నైపుణ్యం పోర్టల్ తో ఇతర పోర్టల్స్ ను కూడా ఇంటిగ్రేట్ చేయాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా యువతకు నైపుణ్యాలను పెంచాల్సి ఉందన్నారు. అలాగే విద్యా రంగంలోనూ కొత్త పాఠ్యాంశాలను జోడించాలని సీఎం సూచించారు. తద్వారా రాష్ట్రంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు లభ్యం అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. నాలెడ్జి ఎకానమీలో ఏపీ నెంబర్ వన్ గా ఉండాలన్నదే తన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.

# అజ్ఞాతంలోకి పేర్ని నాని..

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కోసం గాలిస్తున్న ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

**సైలెంట్‌గా అజ్ఞాతంలోకి.. :** రప్పా.. రప్పా.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పేర్ని నానిపై కృష్ణా జిల్లా పామర్రు పీఎస్ లో టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్టేషన్లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. పామర్రు కేసును కొట్టివేయాలంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, హైకోర్టు పేర్ని నాని విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. అరెస్టు నుంచి ముందస్తు రక్షణ దక్కలేదని ఖంగుతిన్న పేర్ని నాని సైలెంట్‌గా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఈనెల 22న హైకోర్టు విచారణ తరువాత పేర్ని నాని వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

# సీసీటీవీ కెమెరాలు తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

తరగతి గదులు, ప్రయోగశాలలు, లైబ్రరీ, క్యాంటీన్ ప్రాంతం, స్టోర్ రూమ్, ఆట స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. గోప్యతను దృష్టిలో ఉంచుకొని టాయిలెట్లు, వాష్‌రూమ్‌ల వద్ద సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు మినహాయింపు కల్పించినట్లు పేర్కొన్నారు.

**15 రోజుల బ్యాకప్ ఉండాల్సిందే.. :** అయితే, ఈ సీసీటీవీ కెమెరాలు హై రిజల్యూషన్‌తో ఆడియో విజువల్ సౌకర్యంతో ఉండాలని సూచించారు. రియల్ టైమ్ ఆడియో–విజువల్ రికార్డింగ్‌తో కనీసం 15 రోజుల ఫుటేజీని నిల్వ చేయగల సామర్థ్యంతో కూడినవిగా ఉండాలని పేర్కొన్నారు. అవసరమైన సంబంధిత అధికారులు 15 రోజుల బ్యాకప్‌ని యాక్సెస్ చేయగలిగేలా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతతో పాటు సర్వైలెన్స్ మౌలిక వసతులను బలోపేతం చేయడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# ఆస్పత్రిలో చేరిన తమిళనాడు సీఎం..!

(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రిలో చేరారు. దీంతో డీఎంకే పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

మరోవైపు ఆస్పత్రి వర్గాలు మాత్రం స్టాలిన్‌కు ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందిలేదని పేర్కొన్నారు. దీనిపై అపోలో మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ బి జి స్పందిస్తూ "ఆయన లక్షణాలను పరిశీలించాము. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాము" అని ప్రకటన జారీ చేశారు. స్టాలిన్ ఆస్పత్రిలో చేరే సమయంలో ఆయన వెంట కుమారుడు ఉదయనిధి కూడా ఉన్నారు.

# జనరల్ బాడీ సమీక్ష సమావేశం



**నూజెండ్ల (జర్నలిస్ట్ ఫైల్) :** నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పావులూరి ఉమాదేవి అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమీక్షాసమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు డి సి సి బి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ అభివృద్ధి పనుల ప్రగతి, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఎమ్మెల్యే జివి మాట్లాడుతూ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అధికారులకు సూచించారు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీపీ జయరాం రెడ్డి జడ్పిటిసి జడ్డ సుబ్బులు ఎంపీటీసీలు నూజెండ్ల యార్డ్ చైర్మన్ మీసాల మురళి యాదవ్ నాయుకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీ బస్సు.. జీరో ఫేర్ టిక్కెట్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆగస్టు 15 నుంచి మహిళలకు అమలు చేయనున్న ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంలో మహిళలకు 'జీరో ఫేరో టిక్కెట్' ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు... ఉచిత ప్రయాణంతో ఎంతమేర వారికి డబ్బులు ఆదా అయ్యాయి... 100 శాతం ప్రభుత్వం ఇస్తున్న రాయితీ... వంటి వివరాలు ఆ టిక్కెట్‌లో పొందుపరచాలని చెప్పారు. జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడం ద్వారా ఎంత లబ్దిపొందారనే విషయం రాష్ట్రంలోని మహిళా ప్రయాణికులు అందరికీ సులభంగా తెలుస్తుందని ముఖ్యమత్రి అన్నారు. ఇందుకు సంబంధించి సాఫ్ట్‌వేర్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఏ ఏ రాష్ట్రాలకు ఆర్థికంగా ఎంత భారం పడింది... మన



రాష్ట్రంలో ఎంత వ్యయం కానుందనే అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఎట్టిపరిస్థితుల్లో పథకాన్ని ఆగస్ట్ 15 నుంచి సమర్ధవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

**ఆర్టీసీని లాభాల బాట పట్టించండి :** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం త్వరలో అమలు చేస్తున్నందున ఆర్టీసీకి భారం కాకుండా... ఇతర ఆదాయ మార్గాలు పెంపొందించుకోవడం, నిర్వహణా వ్యయం తగ్గించుకోవడం ద్వారా సంస్థను లాభాల బాట పట్టించాలని ముఖ్యమంత్రి సూచించారు. లాభాల ఆర్జనకు ఎలాంటి మార్గాలున్నాయి.. ఎటువంటి విధానాలు తీసుకురావాలి... అనే దానిపై ఒక కార్యాచరణ రూపొందించాలన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం ఉన్నవాటిని ఎలక్ట్రికల్ బస్సులుగా మారిస్తే నిర్వహణా వ్యయం తగ్గుతుందని... అలాగే ఇందుకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే అంశంపైనా అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు.

# కేరళ మాజీ సీఎం కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికైన ఆయన ఒకసారి (2006–2011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు.

**ప్రజాపక్షమే ఊపిరిగా.. :** అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో ఎన్నడూ వెనకంజ వేయని అచ్యుతానందన్... రాష్ట్రంలో భూ ఆక్రమణదారులపైనా ముఖ్యమంత్రిగా ఉక్కుపాదం మోపారు. ఈ చర్యలతో అనేకమంది వ్యతిరేకమైనా ఆయన వెరవలేదు. ప్రజలు.. పార్టీ మధ్య అంతరం వచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ క్రమశిక్షణనూ పక్కనబెట్టి ప్రజల పక్షాన నిలబడటానికే పెద్దపీట వేశారు. ఈ క్రమంలో అవమానాలు ఎదురైనా తన నిజాయితీబాటను, నిరాడంబరతను ఏనాడూ వీడలేదు.

**నిరంతర అధ్యయనశీలి.. :** పుట్టింది 1923లో అయినా... ఆధునిక అవసరాలను కూడా అర్థం చేసుకున్న నిత్య అధ్యయనశీలి. పాతతరంలో భూమి కొంతమంది చేతుల్లో కేంద్రీకృతమైనట్లుగా... సాంకేతిక ప్రపంచంలో సాఫ్ట్‌వేర్‌ల రూపంలో కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం సాగుతోందని గుర్తించిన ఆయన... అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ కోసం ఉద్యమించారు. 2016లో తన 93వ ఏట కూడా కమ్యూనిస్టులకు వీఎస్ విజయవీచిక అయ్యారు.

**సీఎం చంద్రబాబు.. :** కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్ట్ నాయకుడు శ్రీ వి.ఎస్. అచ్యుతానందన్ మృతికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. ఎనిమిది దశాబ్దాలుగా సాగిన ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రయాణం, ఆయన ఆదర్శాలు, ప్రజా సేవ పట్ల దృఢమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఇక ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్య, ఐటీ



శాఖల మంత్రి నారా లోకేష్ సైతం కేరళ మాజీ సీఎం మృతిపై ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారు.. వీఎస్‌తో కలిసి ఉన్న ఫొటో షేర్ చేసిన ప్రధాని మోదీ :** కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ కాలధర్మంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఆయన తన జీవితంలో చాలా కాలం ప్రజా సేవకు, కేరళ పురోగతికే అంకితం చేశారన్నారు. తామిద్దరం ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో జరిగిన సంభాషణలు గుర్తుకొచ్చాయని పేర్కొన్న ప్రధాని.. వీఎస్‌తో కలిసి మాట్లాడుతున్న ఫొటోను 'ఎక్స్'లో షేర్ చేశారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టం: సీపీఎం పొలిట్‌బ్యూరో :** కమ్యూనిస్ట్ ఉద్యమ ప్రస్థానంలో ప్రముఖ నేత అచ్యుతానందన్ మృతి పట్ల సీపీఎం పొలిట్ బ్యూరో తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. వీఎస్ అని అంతా ప్రేమగా పిలుచుకొనే అచ్యుతానందన్ కేరళలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన సమర్థవంతమైన ప్రజానేత అని కొనియాడింది. 17 ఏళ్ల వయసులోనే కమ్యూనిస్టు పార్టీలో చేరి.. భూస్వాములకు ఎదురొడ్డి పోరాటం చేశారని తెలిపింది. సీఎంగా పనిచేసిన సమయంలో శ్రామిక ప్రజల సంక్షేమం కోసం అనేక పాలనా చర్యలు చేపట్టారని తెలిపింది. కేరళ రాజకీయాలపై వీఎస్ చెరగని ముద్ర వేశారని.. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని పేర్కొంది. ప్రజానేతకు నివాళులర్పిస్తూ ఎర్ర జెండాను అవనతం చేసినట్లు తెలిపింది. వీఎస్ అచ్యుతానందన్ సతీమణి, కుమారుడు, కుమార్తెకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ప్రకటన విడుదల చేసింది.

**కేరళ పురోగతికి ఎనలేని సేవలు: సీఎం రేవంత్ రెడ్డి :** కార్మిక ఉద్యమాల నుంచి ప్రముఖ ప్రజా నేతగా ఎదిగిన అచ్యుతానందన్.. సీఎంగా తన పదవీ కాలంలో కేరళ పురోగతికి ఎనలేని సేవలందించారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**విప్లవ వారసత్వాన్ని వదిలి వెళ్లారు: సీఎం స్టాలిన్ :** కేరళ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన వీఎస్ అచ్యుతానందన్ తన విప్లవాత్మక వారసత్వాన్ని వదిలి వెళ్లిపోయారని తమిళనాడు సీఎం, డీఎంకే చీఫ్ స్టాలిన్ అన్నారు. ప్రజా నేతగా, జీవితాంతం కమ్యూనిస్టుగా జీవించారని గుర్తు చేసుకున్నారు. నీతిమంతమైన రాజకీయాలను, ప్రజా సేవా స్ఫూర్తికి ఆయన నిదర్శనమని 'ఎక్స్'లో పేర్కొన్నారు. అలాంటి గొప్ప మహనీయుడి మృతికి తన తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ బాధాకర సమయంలో వీఎస్ కుటుంబ సభ్యులకు, సీపీఎం శ్రేణులకు, కేరళ ప్రజలకు తన తరఫున, తమిళనాడు ప్రజల తరఫున నివాళు లర్పిస్తున్నట్లు తెలిపారు.

# ప్రజాభివృద్ధే టీడీపీ ఆకాంక్ష

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, సూపర్ సిక్స్ పథకాల అమలును ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలన్న ప్రధాన ఉద్దేశంతోనే సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేస్తే నేడు పరిపాలన దక్షత గల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక వ్యవస్థను చక్కబెడుతూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం 12 లక్షల కోట్లు అప్పుచేసిందని .. పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోయారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రానికి తరలి వస్తున్నారని, రూ. సుమారు 10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని అన్నారు. రానున్న నాలుగు ఏళ్ల కాలంలో 20 లక్షలు ఉద్యోగాలు యువతీ, యువకులు అందజేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి ప్రగతిని, సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంతోనే సమర్ధవంతంగా పనిచేస్తుందని అన్నారు. గత వైకాపా ఐదేళ్ల విధ్వంస పాలన నుంచి ప్రజా తిరుగు బాటుతో ప్రజా కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిందని అన్నారు. మహిళలకు ప్రతిఏటా మూడు ఉచిత గ్యాసు సిలెండర్లు ఇస్తున్నామని తెలిపారు. మహిళలకు వచ్చే నెల 15 నుంచి తేదీ నుండి ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్రం ఇచ్చే రూ 6 వేలకు అదనంగా రూ. 14 వేలు కలిపి మూడు విడతలుగా మొత్తం రూ. 20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు



తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న నిరంతరం ప్రజల పక్షాన పనిచేస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 200 అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని అన్నారు. మరో 75 క్యాంటీన్లు ప్రారంభించడం జరుగతుందని అన్నారు. దుర్మార్గుడైన జగన్మోహన్ రెడ్డి పాలనను తిరస్కరించి కూటమి ప్రభుత్వానికి ప్రజలు విజయాన్ని ఇచ్చారు

రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఒక దుర్మార్గుడైన జగన్మోహన్ రెడ్డి పాలనను ప్రజలు తిరస్కరించి కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని అన్నారు. వేల కోట్ల రూపాయలు మద్యంలో అవినీతి జరిగిందని, లిక్కర్ డాన్ జగన్ రెడ్డి అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2019లో 151 సీట్లు గెలవడంతో జగన్మోహన్ రెడ్డికి తలపొగరు బాగా పెరిగిందని, అందువలనే రాష్ట్రంలో ఐదేళ్ల పాటు అరాచక పాలన సాగిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ వైకాపా పార్టీ లాగా గాలికి పుట్టలేదని .. దివంగత నేత ఎన్టీ రామారావు స్థాపించిన పార్టీ అని అన్నారు. 2019 తర్వాత రాష్ట్రం పేరు చెప్తే ఇతర రాష్ట్రాల వారు భయపడే పరిస్థితిని తీసుకు వచ్చారని . అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు లాంటి ఒక అనుభవం ఉన్న ముఖ్యమంత్రి ఉండడం వన రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టం మని అన్నారు. గడిచిన ఐదేళ్లలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి కూడా జరగలేదని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా పల్లె పండుగ అనే కార్యక్రమం చేపట్టి 5000 వేల కోట్లతో గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించారని తెలిపారు. 4000 కోట్లతో గుంతల మయంగా మారిన రాష్ట్ర రోడ్లను ఏడాది కాలంలోనే అభివృద్ధి చేశామని అన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధివైపు పయనిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసే సుపరిపాలన



**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్) :** వినుకొండ పట్టణంలోని, 11 వార్డు రైలు పేట నందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ సుపరిపాలన ఫలాలు అందాలనేదే మా ప్రభుత్వ సంకల్పం. దీనిలో భాగంగానే ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ఇంటింటి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్నామన్నారు . ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు కౌన్సిలర్ షకీలా టిడిపి పట్టణ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య మక్కెన రమేష్ వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విచారణకు అంబటి , రజిని



(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి విడదల రజిని సత్తెనపల్లి గ్రామీణ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి జనసమీకరణ చేయడంతో ఆమెపై కేసులు నమోదయ్యాయి. సత్తెనపల్లి గ్రామీణ, పట్టణ పోలీసు స్టేషన్లలో కేసులు ఫైల్ చేశారు.

# ఉప రాష్ట్రపతి రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధిని గమనించే అవకాశం రావడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. ఇది నాకు సంతృప్తినిచ్చింది. ప్రపంచ వేదికపై భారత్ విజయాల పట్ల గర్విస్తున్నాను. దేశ ఉజ్వల భవిష్యత్తుపై అచంచలమైన విశ్వాసం ఉంది" అని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

**న్యాయవాద వృత్తిలోంచి రాజకీయాల్లోకి... :** రాజస్థాన్ ఓబీసీ జాట్ సామాజిక వర్గానికి చెందిన ధన్‌ఖడ్.. మూడు దశాబ్దాలుగా ప్రజాజీవితంలో ఉన్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన దేశంలోనే రెండో అత్యున్నత స్థానానికి ఎదిగారు. 1951 మే 18న రాజస్థాన్‌లోని ఝున్‌ఝును జిల్లా కిథనా గ్రామంలో జగదీప్ ధన్‌ఖడ్ జన్మించారు. ఎల్ఎల్‌బీ కోర్సు తర్వాత 1979 నవంబరులో రాజస్థాన్ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. రాజస్థాన్ హైకోర్టు, సుప్రీంకోర్టులలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు.

1989లో జనతాదళ్ తరఫున ఝున్‌ఝును లోక్‌సభ స్థానం నుంచి ధన్‌ఖడ్ గెలిచారు. 1990లో అప్పటి ప్రధాని చంద్రశేఖర్ క్యాబినెట్‌లో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రిగా స్వల్పకాలం పనిచేశారు. 1993–98 మధ్య కాలంలో ఎమ్మెల్యేగా ఉన్నారు. పి.వి.నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. 1998 నుంచి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటూ న్యాయవాద వృత్తిలో కొనసాగారు. 2008 తర్వాత భాజపా గూటికి చేరిన ధన్‌ఖడ్... 2019లో అనూహ్యంగా పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యారు.

ఈ క్రమంలోనే 2022లో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అధికార ఎన్డీయే కూటమి ఆయనను తమ అభ్యర్థిగా రంగంలోకి దింపింది. విపక్షాల అభ్యర్థి మార్గరెట్ ఆళ్వాపై 346 ఓట్ల తేడాతో విజయం సాధించారు. భారత 14వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు.

అయితే, ఈ ఏడాది మార్చిలో ఆయన ఛాతీ నొప్పి, అసౌకర్యంతో దిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. జూన్‌లోనూ ఉత్తరాఖండ్‌లోని కుమావు విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవంలో స్పృహతప్పి పడిపోయారు. ఈ క్రమంలోనే తన ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయన ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

## పాఠశాలపై కూలిన యుద్ధ విమానం..



**ఢాకా:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో సోమవారం ఘోర ప్రమాదం జరిగింది. స్థానిక మైల్‌స్టోన్ పాఠశాలపై ఆ దేశ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన శిక్షణ యుద్ధ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. పైలట్‌తోపాటు 16 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మరో 100 మందికిపైగా తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. పాఠశాలలో విద్యార్థులు ఉన్న సమయంలోనే ప్రమాదం జరగడంతో తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

విమానం కూలిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు, పొగలు వ్యాపించినట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడి దృశ్యాలను మీడియా ప్రసారం చేసింది. మరోవైపు ఎఫ్‌-7బీజీఐ ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోయినట్లు బంగ్లాదేశ్ ఆర్మీ అధికార ప్రతినిధి ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు.

**బంగ్లాలో విమాన ప్రమాదం.. సాయం చేసేందుకు సిద్ధం: ప్రధాని మోదీ**

దిల్లీ: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారత్ అండగా ఉంటుందని, అన్నివిధాలా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "ప్రమాద వార్త తెలిసి షాక్‌కు గురయ్యా. మృతుల్లో చాలా మంది యువ విద్యార్థులు ఉన్నారు. చాలా బాధ అనిపించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని మోదీ అన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

## రైతుల్ని ఇబ్బందిపెట్టి... ప్రశాంతమైన పల్లెల్లో ఫ్యాక్షన్ రాజకీయాలు



**చిలకలూరిపేట(జర్నలిస్ట్ ఫైల్) :** రైతులు తమ ఉత్పత్తులు అమ్ముకోనివ్వకుండా చేసిన వారు.. ఇప్పుడు రైతుక్షేమం గురించి మాట్లాడటం సిగ్గుచేటని, గతపాలకులు చేసిన అరాచకాలు, విధ్వంసం, దుర్మార్గపాలనకు విసిగిపోయే ప్రజలు గతఎన్నికల్లో వారికి సరైన బుద్ధిచెప్పారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. దాదాపు 60 నియోజకవర్గాల్లో ఎన్నడూ రానంత మెజారిటీ గత ఎన్నికల్లో కూటమిపార్టీలకు రావడానికి కారణం గత ప్రభుత్వ తప్పుడు విధానాలేనని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికీ తెలుగుదేశంలో భాగంగా నాదెండ్ల మండలం మల్లాయపాలెం, బుక్కాపురం, ఎండుగుంపాలెం గ్రామాల్లో జోరువానలోనూ ప్రత్తిపాటి ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ప్రజల గడపతట్టి.. వారితో మాట్లాడుతూ, వారి ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు.

**వైసీపీపాలనపై విసుగు చెందే కూటమిపార్టీలను గెలిపించారు :** నియోజకవర్గంలో సుబాబుల్ రైతుల్ని గతపాలకులు ఎన్నో ఇబ్బందులు పెట్టారన్న ప్రత్తిపాటి, ప్రశాంతమైన గ్రామాల్లో ఫ్యాక్షన్ రాజకీయాలు చేశారన్నారు. రైతుల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, అసెంబ్లీలో పొగాకు, మిర్చి రైతుల సమస్యలపై మాట్లాడానని ప్రత్తిపాటి చెప్పారు. వైసీపీ పాలనపై తీవ్ర విసుగు చెందే, స్వాతంత్ర్యం వచ్చాక ప్రజలు ఎన్నడూ లేనంత మెజారిటీతో కూటమిపార్టీల అభ్యర్థుల్ని గెలిపించారన్నారు. ఎండుగుంపాలెం గ్రామంలో నెలకు పింఛన్లకే రూ. 14లక్షలు ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. రూ. 17లక్షలవరకు తల్లికి వందనం సాయం అందించారన్నారు. త్వరలోనే మరెన్నో పథకాలు అమలుచేయడానికి ముఖ్యమంత్రి, యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు సాగునీటి సంఘాల ఛైర్మన్ గా ఎన్నికైన రామారావుని గ్రామస్తుల సమక్షంలో ప్రత్తిపాటి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, నల్లమోతు హరిబాబు, కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, గట్టినేని సుమంత్, సింగయ్య, జయప్రసాద్, రాయన్న, ఇన్నయ్య, రాజు, అజితా, కళ్ళం రామారావు, గెరా అశోక్, సుభాని, సుజాతరావు, నాగబాబు, గట్టినేని విజయ్ సాయి, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు ఛైర్మన్ కు సత్కారం



**చిలకలూరిపేట(జర్నలిస్ట్ ఫైల్) :** వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గా నియమితులైన టిడిపి కరీముల్లా ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు దగ్గుమల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో తుబాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం నాడు ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి శాలవ తో సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా నాదెండ్ల మండలం, నాదెండ్ల గ్రామానికి చెందిన నల్లమోతు హరిబాబు రెండవసారి నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటి నుండి నియోజవర్గంలో పార్టీ అభ్యున్నతికి విశేషమైన కృషి చేస్తూ అంచలంచెలుగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహకా కార్యదర్శిగా పార్టీకి సేవలందిస్తూ వివిధ నియోజకవర్గాలకు పార్టీ పరిశీలకులుగా సేవలందించి పార్టీ గెలుపుకి కృషి చేసిన కరిముల్లా కు మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆశీస్సులతో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గా నియామకం కావడం పట్ల నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారని 4 దశాబ్దాలుగా పార్టీకి నిబద్ధతగా పనిచేసే కరిముల్లా మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గా రైతులకు లబ్ధి చేకూరే విధంగా సేవలందించాలని, భవిష్యత్తులో మరెన్నో పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పార్టీకి క్రమశిక్షణతో పని చేస్తే పదవులు వాట అంతట అవే వస్తాయని మన ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఎప్పుడూ చెప్తూ ఉంటారని దానికి నిదర్శనమే నేడు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరీముల్లా . అదేవిధంగా నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన నల్లమోతు హరిబాబులే నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ. మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ నెల్లూరి సదాశివరావు. మురకొండ మల్లిబాబు. తదితరులు ఉన్నారు.

# మూడేళ్లలో అమరావతి నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ సంస్థల ప్రతినిధులను వివరాలు అడిగి వివరాలు తెలుసుకున్నారు..మొత్తం కార్మికులు ఎంతమంది పనిచేస్తున్నారు...?నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న సామాగ్రి,మెషినరీ గురించి అడిగి తెలుసుకున్నారు.ఆ తర్వాత నేలపాడులోని ఆలిండియా సర్వీస్ అధికారుల క్వార్టర్ల వద్ద మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

అమరావతిలో భవనాలు,ట్రంక్ రోడ్లు,సీవరేజి పనులు వేగంగా జరుగుతున్నాయి..ఎల్పీఎస్ లే అవుట్ లలో పనులకు కూడా టెండర్లు పూర్తయ్యాయి...2014-19 మధ్యలోనే అధికారుల కోసం 4000 ఇళ్ల నిర్మాణానికి టెండర్లు కూడా పూర్తి చేసి నిర్మాణాలు ప్రారంభించామన్నారు మంత్రి...అయితే గత ప్రభుత్వం అన్ని పనులను నిలిపివేసిందన్నారు...తిరిగి పాత టెండర్లు రద్దు చేసి,న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకుని కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఆలస్యమైందన్నారు..ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు...కొన్నిచోట్ల మాత్రం వర్షాల కారణంగా కొంచెం ఇబ్బందులున్నాయన్నారు.

వీటిలో ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ క్వార్టర్లు 12 టవర్లలో 288 ఫ్లాట్లు,ఆలిండియా సర్వీస్ అధికారులకు 6 టవర్లలో మొత్తం 144 ఫ్లాట్లు నిర్మిస్తున్నామన్నారు..అలాగే ప్రిన్సిపల్



సెక్రటరీల కోసం 25 బంగళాలు,సెక్రటరీల కోసం 90 బంగళాలు,మంత్రుల కోసం 35 బంగళాలు,జడ్జిల కొరకు 36 బంగళాలు,నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కొరకు మొత్తం 21 టవర్లలో 1968 ఫ్లాట్లు నిర్మిస్తున్నాం.ఇక గెజిటెడ్ ఆఫీసర్స్ లో టైప్ -1 అధికారుల కొరకు 4 టవర్లలో 384 ఫ్లాట్లు,టైప్ - 2 అధికారుల కొరకు 4 టవర్లలో 336 ఫ్లాట్లు,గ్రూప్ - డి ఉద్యోగుల కొరకు మొత్తం 6 టవర్లలో 720 ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు..ఇక అమరావతిలోని హ్యాపీనెస్ట్ లో మొత్తం 6 టవర్లలో 1200 ఫ్లాట్లు నిర్మాణం జరుగుతుందన్నారు...

ఈ మొత్తం భవనాల్లో ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ,ఏఐఎస్ అధికారుల క్వార్టర్లు ఈ ఏడాది డిసెంబర్ లోగా పూర్తిచేస్తామని,ఇతర నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

మరోవైపు ఐకానిక్ భవనాల నిర్మాణాలపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు,డిజైన్ రూపొందించిన నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ప్రతినిధుల మధ్య తుది చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ఐకానిక్ భవనాల నిర్మాణం కూడా ప్రారంభిస్తామన్నారు మంత్రి.

**డిసెంబర్ నాటికి మెజారిటీ ప్రయివేట్ సంస్థల నిర్మాణాలు ప్రారంభం :** అమరావతిలో ఇప్పటివరకూ మొత్తం 72 సంస్థలకు భూకేటాయింపులు చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు...ఆయా సంస్థల ప్రతినిధులతో స్వయంగా సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటుచేసి అగ్రిమెంట్ లు చేసుకున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు...ఆయా సంస్థల్లో మెజారిటీ సంస్థలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి మెజారిటీ సంస్థలు నిర్మాణ పనులు ప్రారంభిస్తాయన్నారు...ఆయా సంస్థలు నిర్దేశిత కాలానుగుణంగా నిర్మాణాలు పూర్తిచేస్తాయన్నారు..

**రెండో దశ భూసమీకరణపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చిస్తాం**

అమరావతిలో రెండో దశ ల్యాండ్ పూలింగ్ పై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు...కేబినెట్ సబ్ కమిటీలో చర్చించారా అని గత మంత్రివర్గ సమావేశంలో సీఎం ప్రస్తావించారని...అందుకే కేబినెట్ సబ్ కమిటీలో చర్చిస్తామన్నారు...కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం మేరకు వచ్చే కేబినెట్ లో భూసమీకరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

# జస్టిస్ వర్మను తొలగించాలి

**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ను విధుల నుంచి తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపీలు అభిశంసన తీర్మానాన్ని ఇచ్చారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఈమేరకు 145 మంది ఎంపీలు తమ పిటిషన్ సమర్పించారు. అదే విధంగా రాజ్యసభలోనూ 63 మంది ప్రతిపక్ష ఎంపీలు నోటీసులు సమర్పించారు. కాంగ్రెస్, టీడీపీ, జేడీయూ, జేడీఎస్, జనసేన, ఏజీపీ, ఎల్‌జేఎస్‌పీ, ఎస్‌కేపీ, సీపీఎం మొదలైన పార్టీల ఎంపీలు ఈ మెమోరాండంపై సంతకాలు చేశారు. ఎంపీలు అనురాగ్ సింగ్ ఠాకూర్, రవిశంకర్ ప్రసాద్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, రాజీవ్ ప్రతాప్ రూడీ, పీపీ చౌదరి, సుప్రియా సులే, కేసీ వేణుగోపాల్ ..తదితరులు జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన తీర్మానానికి మద్దతు తెలిపినట్లు సమాచారం.

సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే ఈ తీర్మానాన్ని తెస్తామని గతంలోనే ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. దానికి అనుగుణంగానే ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాలశాఖ



మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. న్యాయ వ్యవస్థలో అవినీతి అనేది అతి సున్నితమైన, తీవ్రమైన అంశమని అన్నారు. న్యాయ వ్యవస్థలో అవినీతి ఉంటే అది ప్రతి ఒక్కరికీ ఆందోళన కలిగించే అంశమే కాబట్టి జస్టిస్ వర్మను తొలగించే విషయంలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని పేర్కొన్నారు. దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలను ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా.. అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని తేల్చింది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ వర్మకు సీజేఐ సూచించారు. దీంతో ఆయనను న్యాయమూర్తి పదవి నుంచి తొలగించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. అయితే న్యాయమూర్తుల కమిటీ ఇచ్చిన నివేదికను చెల్లనిదిగా పరిగణించాలని కోరుతూ జస్టిస్ వర్మ ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలోని 11వ వార్డు రైలుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఎంతో పురోగతి సాధించిందన్నారు. ఎక్కడికక్కడ ఆస్పత్రుల ఏర్పాటు ద్వారా స్థానిక ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు, టీకాలు, మాతా-శిశు సంరక్షణ, కుటుంబ నియంత్రణ సేవలు అందుబాటులోకి రావడం హర్షణీయం అన్నారు. ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. నేషనల్ హెల్త్ మిషన్ క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 150 పీహెచ్‌సీలు ప్రారంభించడం రాష్ట్ర ఆరోగ్య రంగం అభివృద్ధికి కీలకమైన దశగా పేర్కొన్నారు. అంతేగాక, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గతంలో 150వ స్థానంలో ఉన్న రాష్ట్రం ఇప్పుడు 9వ స్థానానికి చేరుకోవడం అభినందనీయమన్నారు. అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా పట్టణ పేదలకు మేలు జరుగుతుందని తెలిపారు. మంచి వైద్యులు, మెరుగైన ఔషధాలు, ఆధునిక వసతులతో ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో మందులు, ఇంజెక్షన్లు లేక ప్రజలు ఆస్పత్రికి వెళ్లడానికే భయపడేవారని, ఇప్పుడామాటలే లేదు అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవల్లో ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ప్రతినిత్యం బిల్లులు చెల్లిస్తోందని, ప్రజల ఆరోగ్యభద్రతే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, వైద్య శాఖ అధికారులు, కౌన్సిలర్ షకీలా వార్డు నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు స్థలంలో కోర్టు నిర్మాణాలు ఏలా చేస్తారు..!?

**చిలకలూరిపేట(జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలోని 38వ వార్డు పరిధిలోని గల పురుషోత్తమ పట్నం గ్రామ సర్వేనెంబర్ 186/ 3లో పూర్వ విస్తీర్ణమైన ఏ4.75 సెంట్లులోని ఆర్ ఎస్ ఆర్ నందు చెరువు గల స్థలంలోని 91 సెంట్ల భూమి స్థలాన్ని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణం కొరకు ఇచ్చేందుకు శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో సదరు కౌన్సిలర్లు ఆమోదింప చేశారు. దీనిపై పలువురు ప్రజల నుంచి భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. సుమారు 1976 సంవత్సరాల నుంచి గంగమ్మ తల్లి దేవాలయం చెరువుకి అనుకొని ఉండటం వలన ఆ చెరువులోని నీరు పలువురు భక్తులు,ఎస్టీ కాలనీ వాసులు ఇతర సౌకర్యాలకు వాడుకునేవారు. గతంలో ఆ చెరువుకు సాగర జలాల నుంచి నీరు నింపడం వలన వ్యవసాయం చేసుకునే రైతులు, అక్కడ ఎస్టీ ప్రజలు సాగునీరు, తాగునీరును ఉపయోగించుకునేవారు. కాలక్రమేణ మున్సిపల్ శాఖ వారు పైప్లైన్లు వేయడం వలన



చెరువు నీరు అంతగా అవసరం పడలేదు, చెరువు చుట్టూతా పిచ్చి చెట్లు ఏర్పడ్డాయి. చెరువును పూడ్చి ఆయా సామాజిక వర్గాల వారికి ఇవ్వాలని 2019లో ప్రతిపాదనలు జరిగాయి. అక్కడ ఎస్టీ సామాజిక వర్గానికి స్థలం కేటాయించాలని పెద్ద ఎత్తున వివాదం చెల్లారేగడంతో ఆగిపోవడం జరిగింది. ఆ తదుపరి చెరువుకు అనుకొని నివాసం ఉంటున్న ఎస్టీ ప్రజలకు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మంత్రిగా పనిచేసినప్పుడు ఆయన చొరవతో 18 బిఫామ్ పట్టాలు మంజూరు చేశారు. ఇది ఇలా ఉండగా గంగమ్మ తల్లి మొక్కులు

తీర్చుకునే క్రమంలో ఆ చెరువు స్థలాన్ని కోట నాగపూర్ణ చంద్రరావు శుభ్రం చేయించారు. దీంతో న్యాయవాదులు కోర్టు నిర్మాణం కొరకు స్థలాన్ని మున్సిపల్ ఆమోదంతో పల్నాడు జిల్లా కలెక్టర్ పంపిస్తున్నారు.

గంగమ్మ తల్లి మొక్కులు తీర్చుకునేందుకు నిత్యం ప్రజలు వస్తూ ఉంటారు. ప్రతి సంవత్సరం ఎస్టీ, బీసీ, ఇతర సామాజిక వర్గాల చెందినవారు కొలుపులు నిర్వహిస్తారు. ఉత్సవాలు, శరన్నరాత్రులు, జాతర్లు జరిగేటప్పుడు డీజేలు, మైకులు పెడుతూ ఉంటారు.. గంగమ్మ తల్లి దేవాలయానికి వచ్చే భక్తులు గంటలు కొట్టడము వలన

కోర్టు నిర్మాణం జరగడం వలన ఇతర ఆటంకాలు ఏర్పడతాయి. నిర్మాణం జరిగిన తర్వాత కోర్టుకు వచ్చే ముద్దాయిలు, పోలీసులు ఇతర ప్రజలు పెద్దసంఖ్యలో వస్తూ ఉంటారు. తీర్పులు ఇచ్చేటప్పుడు, ఆలయానికి వచ్చే భక్తులు గంటలు కొడితే( పెనాల్టీలు) అధిక రుసుము విధిస్తారా.. అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దేవాలయాలు, మసీదు, మందిరాలు, చెరువులు ఉన్నచోట నిర్మాణాలు చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ, ఆనిబంధనలను తుంగలో తొక్కుతూ ఉన్నారు.

వర్షాకాలంలో కాలని చుట్టూతా ఉన్న వ్యవసాయ భూమిలో నుంచి నీరు అంతయు ఆ చెరువులో చేరుతుంది. అదేవిధంగాకాలనీలోని మురుగు నీరంతా అందులోనే చేరుతుంది. అక్కడ నిర్మాణాలు ఎలా చేపడుతారని పలు ప్రశ్నలు సంధిస్తున్నారు.

కోర్టు నిర్మాణాలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలి. నిబంధనకు విరుద్ధంగా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు న్యాయ నిపుణులు చెబుతున్నారు. కొత్త మార్కెట్ యార్డ్ , మున్సిపల్ రిజర్వు స్థలాల్లో నిర్మాణాలు చేసుకోవచ్చు అని పలువురు ప్రజలు భావిస్తున్నారు. ఈ మేరకు అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిఉంది.

# ప్రజల సొమ్ముకు కూటమి ప్రభుత్వం జవాబుదారి గా వ్యవహరిస్తుంది

**దర్శి (జర్నలిస్ట్ ఫైల్) :** సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం దర్శి మండలం, తూర్పు వీరాయపాలెం గ్రామంలో దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కూటమి పాలన పై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. లిఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రజల సొమ్ము దోచుకునే పార్టీలు, నాయకులకు ప్రజా కోర్టులో శిక్ష తప్పదని డాక్టర్ లక్ష్మి హెచ్చరించారు. 3,500 కోట్లు ఒక్క లిక్కర్ స్కామ్ లోనే దోచుకొని దాచుకొని తప్పించుకోవాలంటే కుదరదని, కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆస్తులను కాపాడడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ , ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు గత అయిదేళ్ల ఆంధ్ర ప్రదేశ్ ను విధ్వంసం నుండి వికాసం వైపు నడిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పరితపిస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రం నుండి వెళ్లిపోయిన పరిశ్రమలను తిరిగి రప్పించడం, విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించడంతో ప్రజలకు నమ్మకాన్ని కలిగించే లక్ష్యంగా మన ప్రభుత్వం ముందుకు వెళుతుంది. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు వలె ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ఏడాది కూటమిపాలన ప్రజాపాలనగా



సాగుతుంది. ఏ గడపకు వెళ్లినా, ఏ తల్లిని అడిగినా, ఏ చెల్లిని అడిగినా వారిలో ఆనందం కనిపిస్తుంది. ఈ ఏడాది చంద్రన్న పాలనలో అందరం ఆనందంగా స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల అక్రమ కేసులు, కులమతాల మధ్య చిచ్చు పెట్టడం, వర్గ వైషమ్యాలు, విధ్వంసాలతో విసిగిపోయామని, ప్రాణాలకు, తమ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు వాపోయారన్నారు. ఏడాది కూటమిపాలనలో మేమంతా ఆనందంగా ఉన్నామని చెబుతుంటే కూటమి ప్రభుత్వ ప్రతినిధిగా ప్రతి గడపకు వెళ్లి వింటుంటే నాకెంతో ఆనందంగా ఉంది. ప్రజల కోసం, ప్రజల హక్కుల కోసం, ప్రజల కు మేలు చేయాలనే తలంపుతో విద్య వైద్యం మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరంతరం మన ప్రభుత్వం కృషి చేస్తుంది. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కాలంలో దర్శి నియోజకవర్గంలో గత వైసీపీ నిర్లక్ష్యానికి నిలువుటద్దాలుగా అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను ముందుకు తీసుకు వెళుతున్నాం. దాదాపు 200 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం. ఇది మన ప్రజా ప్రభుత్వంలోనే సాధ్యమైంది. గత ప్రభుత్వంలో అక్రమ కేసులు, కులాల మధ్య చిచ్చు పెట్టడం వంటి కార్యక్రమాలతోనే ఐదేళ్లు కాలం గడిపారు. వారి పాపాలు పండి జైళ్ల బాట పట్టే రోజులు వచ్చాయి. తప్పించుకునేందుకు జనం మధ్యకు వచ్చి రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు, ప్రజలు మోసపోయే పరిస్థితుల్లో లేరు. ఒకసారి నమ్మి ఓటేస్తే ఆంధ్ర రాష్ట్రాన్ని 50 ఏళ్ల వెనకబాటుతనానికి కారణమయ్యారు. మరొక్కసారి నమ్మే పరిస్థితిలో లేమని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. ప్రతి గడపలో మన సంక్షేమ అభివృద్ధి ఉండాలి, అందుకు ప్రజలందరూ కూటమి ప్రభుత్వంలో అందే ఫలాలను అందిపుచ్చుకోవాలి. ఎవరికైనా సాంకేతికంగా సంక్షేమ పథకాలు అందకపోతే సంబంధిత అధికారుల ద్వారా వెంటనే చర్యలు చేపట్టాలని పార్టీ నాయకులను కోరారు. ఇలా అభివృద్ధి సంక్షేమ ప్రభుత్వంలో మనమందరం సేవకులుగా సైనికులుగా పనిచేయాలని డాక్టర్ లక్ష్మి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మన డాక్టర్ లక్ష్మి గారికి తూర్పు వీరాయపాలెం గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు పెద్ద ఎత్తున ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పెద్దలు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎంతో ఉత్సాహపూరిత వాతావరణం లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో దర్శి మార్కెట్ యాడ్ ఛైర్మన్ దారం నాగవేణి - సుబ్బారావు, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మరెళ్ల వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు మండాది వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షులు చిన్న, టిడిపి నాయకులు వెంకటేశ్వర్లు మధుమంచి ఏడుకొండలు, నియోజకవర్గం లోని వివిధ హోదాల్లో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు, క్లస్టర్లు, యూనిట్ మరియు బూత్ ఇంచార్జిలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపికను బహూకరిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

# హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాసంలో బోనాలు ఉత్సవం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** హైదరాబాద్ నగరంలోని రామ్‌నగర్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాసంలో ఆదివారం నిర్వహించిన బోనాలు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి లోకసభసభ్యుడు ఈటల రాజేందర్, మాజీ మంత్రులు మర్రి శశిధర్‌రెడ్డి, సి. కృష్ణయాదవ్, బండారు దత్తాత్రేయ సతీమణి బండారు వసంత, బండారు విజయలక్ష్మి ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉస్మానియా వర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఇస్రో ఛైర్మన్ నారాయణన్

**హైదరాబాద్, జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఇస్రో ఛైర్మన్ హాజరు కానున్నారు. యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో ఆగస్టులో నిర్వహించ నున్నారు. 1917లో ఏర్పడిన ఉస్మానియా విశ్వవిద్యాలయం 84వ స్నాతకోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను యూనివర్సిటీ ఇప్పటికే ప్రారంభించింది. ఆగస్టులో జరగనున్న 84వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి నారాయణన్ పాల్గొని ప్రసంగిస్తారని ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం ప్రకటించారు. యూనివర్సిటీ కులపతి(ఛాన్స్‌లర్) అయిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గత రెండేళ్లల్లో వివిధ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి పట్టాలు, బంగారు పతకాలు, స్నాతకోత్సవ పట్టాలు, పరిశోధక డిగ్రీలు అందించనున్నారు.

యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సంబంధించి ఇప్పటికే విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలల్లో యూనివర్సిటీలో కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీలు, డిప్లొమాలు, బంగారు పతకాలను స్నాతకోత్సవంలో ప్రధానం చేయనున్నారు. నవంబర్ 1, 2023 నుండి .. ఆగస్టు 6, 2025 మధ్యకాలంలో పరిశోధక డిగ్రీ(పిహెచ్‌డి) పొందిన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. పట్టా పొందేందుకు అర్హత కలిగిన విద్యార్థులు పట్టాలు పొందేందుకు దరఖాస్తులను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆలస్య రుసుము లేకుండా ఆగస్టు 7 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి యూనివర్సిటీ అవకాశం కల్పించింది. ఆలస్య రుసుముతో ఆగస్టు 12 వరకు అవకాశమిచ్చారు. పూర్తి వివరాలకు ఓయూ వెబ్ సైట్‌లో పొందవచ్చని యూనివర్సిటీ ప్రకటించింది.



బిసి సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# రిజర్వేషన్లు అమలయ్యే వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** రిజర్వేషన్లు అమలు అయ్యేవరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల ఆమలు, కేంద్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టాలని నిర్ణయించిన అంశాలపై భవిష్యత్తు కార్యాచరణ చర్చించడానికి ఆగస్టు 3న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా, మండల, రాష్ట్రస్థాయి ముఖ్య నాయకులు హాజరుకావాలని కోరారు. ఆదివారం బిసి భవన్‌లోజరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాజాగా జరగబోయే స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అమలుకు తీసుకోవలసిన కార్యచరణ రూపొందించాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యే వరకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. బీసీలందరూ ఈ రిజర్వేషన్లు కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో కులగణన చేపట్టాలని చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. 75 కోట్లకు పైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల డిమాండును కేంద్రం గౌరవించినట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి ధన్యవాదాలు తెలిపారు. బిసిల విద్య ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, బిసిలకు పారిశ్రామిక పాలసీలో 50 శాతం కోటా ఇవ్వాలని, హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియ మాకంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని, ప్రైవేటు రంగంలో ఎస్సి,ఎస్టీ, బీసిలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులూ గుజ్జ కృష్ణ ,నీల వెంకటేష్, అంజి, లింగయ్య యాదవ్,ఆశిష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విపత్తులవేళ మృతదేహాలను గుర్తించేందుకు

# ఎన్డీఆర్ఎఫ్‌లోకి ప్రత్యేక జాగిలాలు

**హైదరాబాద్, జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** విపత్తుల నిర్వాహణలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) అందించే సేవల గురించి తెలిసిందే. వరదలు, భూకంపాలు, కొండ చెరియలు విరిగిపడినపుడు, ఘోర రైలు, రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించే ఎన్‌డిఆర్‌ఫ్ సిబ్బంది ఇప్పటి వరకు బాధితులను రక్షించడానికి ప్రాధాన్యత ఇస్తుండగా ఇకముందు ఈ తరహా ఘటనల్లో మరణించిన వారి మృతదేహాలను వెలికి తీసేందుకు చొరవ తీసుకోనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన జాగిలాల బృందం త్వరలో రంగంలో దిగనుంది. ఈ జాగిలాల మొదటి బ్యాచ్ ఇప్పటికే శిక్షణ తీసుకుంటుండగా త్వరలో ఇది పూర్తికానుంది. జాగిలాలు విపత్తుల వేళ శిధిలాలలో మృతదేహాలను గుర్తించేందుకు వీలుగా శవా ల వాసను పోలివుండే ఒక రకమైన సెంట్ వాసనను విదేశాల నుంచి తెప్పించి వీటి చేత జాగిలాలకు శిక్షణ ఇస్తు న్నారు. ఇందులో భాగం గా మొదటి విడతగా బెల్జియం, మాలినోయిస్, లాబ్రాడార్ జాతులకు చెందిన జాగిలాలకు విపత్తుల సమయాల్లో మృత దేహాలను గుర్తించే శిక్షణ ఇస్తున్నారు.

తమిళనాడు, ఉత్తరప్రదేశ్ లోని ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్లలో అరడజనకు పైగా జాగిలాలకు శిక్షణ పూర్తి కావస్తుండగా త్వరలోనే తొలిబ్యాచ్ జాగిలాలు విధుల్లో చేరనున్నాయి. విపత్తుల సమయంలో ప్రాణాలను కాపాడడంపై ఎన్‌డిఆర్‌ఫ్ ఇంతకాలం ఎక్కువగా దృష్టి సారిస్తున్నా తమ వారి కోసం, ఒక వేళ చనిపోయి వుంటే మృత దేహాల కోసం బాధి త కుటుంబాలు పడుతున్న వేదనను గమనించి ఈ ఏర్పాట్లు చేసినట్లు ఎన్‌డిఆర్‌ఫ్ అధికారులు చెబుతున్నారు. ఇంత కాలం విపత్తుల వేళ మృతదేహాల గుర్తింపు కష్టంగా వుండేదని, చాలా ఘటనలో మరణించిన వారి శవాలు దొరికేవి కావని, కొని ్న సార్లు కష్టంగా రోజుల తరువాత అవయవాలు లభించేవని ఎన్‌డిఆర్‌ఫ్ అధికారులు తెలిపారు. విపత్తుల వేళ ప్రాణాలతో బయటపడ్డ వారి కంటే చనిపోయిన వారిని గుర్తించడం చాలా కష్టంగా మారుతుండడం తెలిసిందే. కొన్ని ఘటనల్లో ప్రమాదం జరిగిన ప్రాంతా నికి చాలా దూరంలో మృ తదేహాలు లభిస్తుండగా ఇంకొన్ని చోట్ల మట్టిలో కూరుకుపోయిన స్థితిలో వుంటున్నాయి. ఈ తరహా ఘటనల్లో మృతదేహాలను గుర్తించాలంటే ఇప్పు డున్న జాగిలాలకు సాధ్యం కావడం లేదు. విదేశాల్లో మృతదేహాలను, మానవ అవ యవాలను గుర్తించేందుకు వీలుగా జాగిలాలకు ప్రత్యేకంగా శిక్ష ణ ఇచ్చి వాటి సేవలను వాడుకుంటున్నారు. ఈ తరహా ఏర్పాట్లు దేశంలోనూ చేసేందుకు నిర్ణయించిన ఎన్డీఆర్ఎఫ్ ఇందుకోసం ప్రత్యేకంగా ఎంపిక చేసిన జాగిలాలకు శిక్షణ ఇస్తోంది. వచ్చే నెలలో వీటి శిక్షణ పూర్తవుతుందని ఎన్డీఆర్ఎఫ్ అధికారులు తెలిపారు. అనంతరం వీటిని దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన బెటాలియన్లలో అందుబాటులో వుంచుతామని వారు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఈ జాగిలాలు ఏ మేరకు విజయ వంతమవుతాయనేది పరిశీలించి అనంతరం మరిన్ని జాగిలాలకు శిక్షణ ఇస్తామని అధికారులు వెల్లడించారు. ఇటీవల శ్రీశైలం ఎస్ఎల్‌బిసి సొరం గంలో కార్మికులు చిక్కుకుపోయిన సమయంలో వారి ఆచూకి కొనుగొనేందుకు రాష్ట్ర పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఎంత కష్టపడ్డారో తెలిసిందే. ఈ సమయంలోనే కేరళ పోలీసు విభాగానికి చెందిన రెండు జాగిలాలు రంగంలో దిగి మృతదేహాల గుర్తింపులో పోలీసులకు సహాయం అందించాయి. కేరళలోని వయనాడ్‌లో యేడాది క్రితం కొండ చరియలు విరిగిపడినపుడు మట్టిలో కూరుకు పోయిన మృతదేహాల గుర్తింపుకు, ఇతర సహా యక చర్యల్లో ఈ జాగిలా లనే ఉపయోగించారు. ఇప్పుడు ఎన్డీఆర్ఎఫ్ ఇదే తరహాలో శిక్షణ పొందిన జాగిలాలను రంగంలో దించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.



ఎన్‌డిఆర్ఎఫ్‌లో మృతదేహాలను గుర్తించేందుకు కొత్తగా శిక్షణ పొందుతున్న ప్రత్యేక జాగిలాలు

# గ్రాండ్‌గా శ్రీచైతన్య కావూరి హిల్స్ జోన్ ఫ్రెషర్స్‌డే వేడుక

**హైదరాబాద్, జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** నలభై ఏళ్లుగా విద్యారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రైజ్ ఆఫ్ అచీవర్స్ అండ్ రాక్‌స్టార్స్ 2కె25(ఆర్‌వోఏఆర్) పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలను శ్రీచైతన్య కావూరి హిల్స్ జోన్ ఘనంగా నిర్వహించింది. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ వేడుక విద్యార్థినీ, విద్యార్థులలో ఉత్తేజాన్ని, నూతన ఆశయాలను నింపింది. ఈ కార్యక్రమానికి శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సుష్మ బొప్పన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... "ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. శ్రీచైతన్య అందిస్తున్న ప్రపంచస్థాయి విద్యా వేదికను మెరుగైన రిజల్ట్స్ కోసం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఏటా ఐఐటి-జెఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు సాధిస్తున్న అఖండ విజయాలు, నాసా, ఐఎస్‌డిసి వంటి అంత ర్జాతీయ స్థాయిలో విజేతలుగా నిలుస్తున్న విద్యార్థుల ప్రతిభాపాట వాలు గురించి ప్రశంసలు గుప్పించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ అవినాష్ మోహాంతి, గెస్ట్ ఆఫ్ హానర్‌గా పాల్గొని విద్యార్థులు బాధ్యత గల పౌరులుగా మారాలని పిలుపునిచ్చారు. మాదాపూర్ డిసిపి డాక్టర్ వినీత్ జీ, ప్రత్యేక అతిథిగా, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ గెస్ట్ ఆఫ్ హానర్‌గా సందడి చేశారు. సినీ నటుడు హైపర్ ఆది గెస్ట్‌గా హాజరై విద్యార్థులతో తమదైన శైలిలో నవ్వులు పంచుకున్నారు. ఈ వేడుక ద్వారా విద్యార్థుల్లో భవిష్యత్ లక్ష్యాలపై మరింత స్పష్టత, ప్రేరణ అందించాలని నిర్వాహకులు వెల్లడించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, విజయోత్సాహాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# స్విట్జర్లాండ్‌లో జరిగే బతుకమ్మ వేడుకలకు రండి

## మంత్రి జూపల్లిని ఆహ్వానించిన ఇండియన్ అసోసియేషన్

**హైదరాబాద్, జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** ఇండియన్ అసోసియేషన్, స్విటరాండ్ సెక్రెటరీ వేదాంతం కిరణ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు డి.అవినాష్ పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపలి కృష్ణారావును సెక్రటేరియట్ లోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బెర్న్ నగరం స్విటరాండ్ నందు నిర్వహించే బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపలి వేదాంతం కిరణ్, ఎగిక్యూటివ్ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి వీలు చూసుకుని తప్పకుండా హాజరవుతానని వారికి హామీ ఇచ్చారు.

# సాహితీయోధుడు దాశరథి

## ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్

## ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి 'కిన్నెర -దాశరథి' పురస్కారం ప్రదానం



ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి 'కిన్నెర-దాశరథి' పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ బి.కృష్ణమోహన్, చిత్రంలో డాక్టర్ కె.వి.రమణాచారి తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** తెలుగుజాతికి సేవ చేసిన వారిని స్మరించుకుంటే భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో మహాకవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా ప్రముఖ కవి, విమర్శకులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి 'కిన్నెర -దాశరథి' పురస్కారం ప్రదానోత్సవ సభ ప్రభుత్వ పూర్వ సలహదారు డాక్టర్ కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ కృష్ణమోహన్ పురస్కారాన్ని ప్రదానం చేసి ప్రసంగించారు. ఈదివిలో విరిసిన పారిజాత పరిమళాలు దాశరథి గీతాలు అని అన్నారు. పద్య, గేయ, కవితా రచనలు స్వైర విహారం చేస్తున్న రోజుల్లోనే దాశరథి 'తరతరాల బూజు నిజామ్ రాజు' కవితలు రాశారని, ఆయన ఒక సాహితీ సమరయోధుడు అని కీర్తించారు. అంత గొప్ప సాహితీ సమరయోధుడు అయినా కూడా సృజనాత్మకమైన వ్యక్తిగా పేరును సంపాదించారన్నారు. ముఖ్యంగా చలనచిత్ర రంగంలో చరిత్రలో నిలిచిపోయే విధంగా ఎన్నో గొప్పగొప్ప పాటలను రాశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ రూపానికి వామనుడైనా ఆయనలో ఉండే సంఘర్షణకు ఆత్మవిశ్వాసం, వాగ్ధాటితో సారస్వతలోకంలో త్రివిక్రముడైనటువంటి గొప్ప వ్యక్తి దాశరథి అని అన్నారు. అన్ని ప్రక్రియలను స్పృషించిన దాశరథి ఆయా రంగాల్లో రాణించారన్నారు. తెలంగాణ ప్రాంతంమంటే అపారమైన ప్రేమ కలిగి ఉండేవాడని, తెలంగాణ తల్లి కంగాతవల్లే, తెలంగాణ లేమ సౌందర్య సీమ, నా తెలంగాణ కోటి అందాల జాన, నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ తెలంగాణ అంటూ కలువరించి, పలువరించి జైలు జీవితం అనుభవించినంత కాలం రాష్ట్రం, ప్రాంతం కోసం నిజామ్‌ను ఎదిరిస్తానని చెప్పిన వ్యక్తి దాశరథి అని అన్నారు. నిజామాబాద్‌లో ఇందూరు జైలులో ఉన్న సమయంలో 'ఓ నిజామ్ పిశాచమా కానరాడు నిన్ను పోలిన రాజు ...నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ రాసిన వ్యాఖ్యలు నేటికి ప్రజల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయుడు టి.ఉడయవర్లు, ప్రముఖ రచయిత కె.ప్రభాకర్, దాశరథి కుమార్తె ఇందిరా గౌరీశంకర్, నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 'దాశరథి సినీ సంగీత విభావరి'లో గాయనీ గాయకులు బాలకామేశ్వర రావు, డాక్టర్ ఎ.నాగేశ్వరరావు, వి.ఎ.లక్ష్మి, సురేఖామూర్తి తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## గిరిజనుల స్వయంఉపాధికి

# రూ.2,370 కోట్లు

**హైదరాబాద్, జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో గిరిజనులకు స్వయం ఉపాధి పథకాల నిమిత్తం ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2,370 కోట్లను కేటాయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి వివిధ స్కీమ్స్ అమలు చేసేందుకు ట్రైకార్ (తెలంగాణ ట్రైబల్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్) బోర్డు ఆమోదం తెలిపింది. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ సంక్షేమ భవన్ లో ఛైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన ట్రైకార్ బోర్డు మీటింగ్ జరిగింది.

ఈ యేడాది రాష్ట్రంలోని 1,40,243 మంది గిరిజనులకు రాజీవ్ యువ వికాసం ద్వారా లోన్లు ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే గిరిజన రైతులకు సోలార్ పవర్, ఉచిత మోటార్ అందజేయనుంది. వివిధ స్వయం ఉపాధి పథకాల నిమిత్తం ట్రైబల్ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. అంతేకాకుండా సొంతగా వ్యాపారం స్థాపించుకునేందుకు సీఎం ఎస్టీ ఎంట్రపెన్యూర్ షిప్, ఇన్నోవేషన్ స్కీమ్ కింద తక్కువ వడ్డీకి లోన్లు ఇవ్వాలని గిరిజన సహకార సంస్థ బోర్డు తీర్మానించింది.



అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహించిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు

# పాతబస్తీలోని అన్ని ఆలయాల్లో అత్యంత వైభవంగా బోనాల ఉత్సవాలు

**హైదరాబాద్ (చార్మినార్), జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** హైదరాబాద్ పాతనగరంలో ఆదివారం అత్యంత వైభవంగా బోనాల జాతర ఉత్సవాలు జరిగాయి. ఆషాడ మాసం సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం,హరిబౌలి బంగారు మైసమ్మ దేవాలయం, మీరాలమండి మహంకాళేశ్వరి ఆలయం, సుల్తాన్ షాహి జగదాంబ ఆలయం. ఉప్పుగూడ మహంకాళి ఆలయం, చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరం, దూద్‌బౌలిలోని మహరాజ్‌గంజ్ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంతో పాటు పాతనగరం ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి పరిధిలోని ఇరవై రెండు దేవాలయాలలో ఆదివారం ఘనంగా బోనాల ఉత్సవాలు జరిగాయి.శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయంలో ప్రభుత్వం తరుపున అమ్మ వారికి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పట్టు వస్త్రాలు సమర్పించారు.రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,డిప్యూటి స్పీకర్ రామచందర్ నాయక్,మాజీ మంత్రి గీతారెడ్డి, బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్,ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ఛైర్మన్ జి.రాఘవేందర్,కమిటి ప్రతినిధులు ఎస్.పి.క్రాంతి కుమార్‌లు అమ్మవారికి పూజలు నిర్వహించారు. సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ ఆలయంలో కమిటి ఛైర్మన్ రాకేష్ తివారి ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్,ఎంపి ఈటల రాజేందర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్‌తో పాటు పలువురు ఆలయాన్ని సందర్శించి అమ్మ వారికి పూజలు జరిపారు.పాతబస్తీ దూద్‌బౌలిలోని పైనీరు ముత్యాలమ్మ ఆలయంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, మందిరం కమటి ఛైర్మన్ ఆనంద్ గుప్తలు అమ్మవారికి పూజలు నిర్వహించారు.చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో అమ్మ వారికి ప్రభుత్వం తరుపున రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్,రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తోపాటు పలువురు మంత్రులు, ఎంపిలు, కార్పొరేటర్లు, అధికారులు చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వ హించారు. కాగా పాతబస్తీలోని 268 మహంకాళి ఆలయాలలో ఆదివారం వైభవంగా బోనాలు ఉత్సవాలు జరిగాయి.




తెలంగాణ యూనియన్ బ్యాంకు గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ మహాసభలో మాట్లాడుతున్న ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు

# బ్యాంకుల్లో పనిచేస్తున్న అప్రైజర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

## ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు

**హైదరాబాద్, జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** బ్యాంకులలో పనిచేస్తున్న అప్రైజర్స్‌కు ఉద్యోగ భద్రత, మెరుగైన అప్రెయిజర్ చార్జీల చెల్లింపు, తగిన గౌరవం, పని గంటల విధానం కోసం ఎఐబిఇఎ తన వంతు కృషి చేస్తుందని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) కార్యదర్శి బి.ఎస్.రాంబాబు చెప్పారు. తెలంగాణ యూనియన్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ మొదటి మహాసభ ఆదివారం హైదరాబాద్‌లోని పర్వానాహాల్‌లో జరిగింది. సమావేశానికి తెలంగాణ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ అప్రైజర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.రాఘవాచారి అధ్యక్షత వహించగా, సమావేశాన్ని ఉద్దేశించి బిఎస్ రాంబాబు, ఎ పిటిబిఇఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, యుబిఏ ఈయుటిఎస్ ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్, తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వి.రాఘవాచారి, విశ్వకర్మ ఆత్మగౌరవ భావన ట్రస్ట్ ఛైర్మన్ ఎల్.వెంకటాచారి, హైకోర్టు న్యాయవాదులు రఘునాథ్, పి.శ్రీనివాస్, కె.అనంత చారి ప్రసంగించారు.

తొలుత బి.ఎస్.రాంబాబు ప్రసంగిస్తూ గతంలో బ్యాంకింగ్ రంగం, ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యాలు, పాలకులు బ్యాంకు ఉద్యోగుల యూనియన్ చర్చలు జరిపి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం చేసుకునేవని, ఇటీవలి కాలంలో బ్యాంకుల యజమాన్యాలు, పాలకులు ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు కూడా నిరాకరిస్తుండడం గర్హనీయమన్నారు. ఫలితంగా ఉద్యోగులు, బ్యాంకింగ్ వ్యవస్థ అనేక సవాళ్లు, సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. యూనియన్ బ్యాంకులో గోల్డ్ లోన్‌లు నిలిపివేయాలని కొంతమంది అధికారులు అనధికారికంగా తీసుకున్న నిర్ణయంపై ఏఐబిఏ బ్యాంకు ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్‌కు లేఖ రాసి బంగారంపై రుణాలను నిలిపివేయడం వల్ల బ్యాంకుపై ఖాతాదారులలో అపనమ్మకం ఏర్పడుతుందని, ఫలితంగా బ్యాంకు ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించినట్లు ఆయన చెప్పారు. సమా వేశంలో టిఏబిజిఏఎఫ్ ముఖ్య సలహాదారులు టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.విజయ్ కుమార్, కోశాధికారి ఆ ర్.సతీష్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస చారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.అనంత రాములు, కార్యవర్గ సభ్యులు, పి.శ్రీకాంత్, జి.నాగ రాజు, యుబిఏఈయుటిఎస్ కార్యదర్శులు కె.రాజేష్ కుమార్ పి.సుధాకర్ రెడ్డి, పి.శ్రీకాంత్, వి.రాజేష్ మనోజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ద్వారా డ్రైవర్, కండక్టర్ నియామకాలను ఆపేయాలి

## ఆర్‌టిసిలో యూనియన్లకు అనుమతించాలి.. విలీన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

## ప్రభుత్వానికి ఎస్‌డబ్ల్యుయు జనరల్ సెక్రటరీ రాజిరెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 21(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి)లో ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టనున్న డ్రైవర్, కండక్టర్ పోస్టుల నియామకాలను వెంటనే ఆపేయాలని టిజిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుయు ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆర్‌టిసిలో యూనియన్లను అనుమతించాలని.. అలాగే ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. 2021వేతన సవరణ, విద్యుత్ బస్సుల పథకంలో సవరణ, డ్రైవర్, కండక్టర్ల తో పాటు ఇతరత్ర పోస్టులను ఔట్ సోర్సింగ్ ద్వార చేస్తున్న నియామకాలను ఆపివేసి అన్ని కేటగిరీలలో రెగ్యులర్ నియామాలు చేపట్టాలన్నారు. అలాగే సిబ్బందిపై పనిభారాలు తగ్గించేలా చర్యలు తీసుకుంటూ.. వేదింపులు ఆపాలని యాజమాన్యాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టిన సమస్యలను.. ప్రభుత్వం వచ్చి 20 నెలలు అవుతున్న పరిష్కరించక పోవడాన్ని తప్పు పట్టారు. సంవత్సరం నుండి 3038 పోస్టులకు శాంక్షన్ ఇచ్చినామని రిక్రూట్ చేస్తున్నామని పదే పదే చెప్పుకుంటు ఆ నియామకాలు చేపట్టకుండ ఆర్‌టిసి చరిత్రలో లేనివిధంగా ప్రయివేటు ఏజెన్సిల ద్వార ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్ల, కండక్టర్ల నియామకాలు చేపట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మహాలక్ష్మి పథకం వలన పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచకుండా.. రిటైర్ అయిన వారి స్థానంలో నియామకాలు చేపట్టకుండా.. ఉన్న కార్మికుల పైన విపరీతమైన పనిభారాలు పెంచుతూ కార్మికులను వేధిస్తున్న విషయాలపై.. వాటితోపాటు కార్మికుల సమస్యలపైన పలుమార్లు ప్రభుత్వానికి, ఆర్‌టిసి యాజమాన్యానికి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ.. అలాగే బస్సు భవన్ ముట్టడించినా కాంగ్రెస్ ప్రజా పాలనలో కార్మిక సంఘాలతో మాట్లాడక పోవడాన్ని టిజిఎస్ ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ఐఎన్టీయుసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తక్షణమే 2021 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగ మాస్టర్ పే స్కేల్ ఇవ్వాలని రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌టిసిలో గత ప్రభుత్వం యూనియన్లను అనుమతించకుండా వెల్ ఫేర్ కమిటీలను ప్రోత్సయించిదని.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 20 నెలలైనా రుపాయి ఖర్చులేని వెల్ఫేర్ కమిటీలను రద్దుచేసి ట్రేడ్ యూనియన్లను అనుమతించక పోవడం వలన గత బిఆర్ఎస్ పాలన కంటే కాంగ్రెస్ పాల నలో పనిభారాలు పెంచడం, కార్మికులపై వేధింపులు పెరిగాయన్నారు. ఆర్‌టిసిలో యూనియన్లను అనుమతించాలన్నారు. ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి విధి విధానాలను రూపొందించడానికి కమిటీ వేయాలని...ఆ కమిటీలో యూనియన్లకు ప్రాతినిద్యం కల్పించాలని.. త్వరిత గతిన రిపోర్ట్ ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని.. అలాగే అపా యింటెడ్ డేను ప్రకటించాలని రాజిరెడ్డి డిమాండ్ చేశారు. 2019 సమ్మె కాలంలో అక్రమంగా పెట్టిన పోలీస్ కేసులను ఎత్తి వేయాలన్నారు. కోర్టు ఆదేశాలను అమలు చేస్తూ ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన రెగ్యులర్ నియామకాలు చేపట్టి కార్మికుల పైన పనిభారాలు తగ్గించాలని రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ జాతీయ అవార్డు అందుకున్న డా. కొల్లూరి



పెడన, జులై 21(జర్నలిస్ట్‌ఫైల్):

కృష్ణాజిల్లా పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు (కేసిటి) వ్యవస్థాపకులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ జాతీయ అవార్డు అందుకున్నారు. వైఎంకె అకాడమీ స్వచ్ఛంద సేవా సంస్థ వారు విజయవాడ అజిత్ సింగ్ నగర్ గుజ్జ్ళ్ళ సరళ దేవి ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వైఎంకె అకాడమీ వ్యవస్థాపకులు గల్లా రూఫస్ పాల్ తదితరులు నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ జాతీయ అవార్డును డా. కొల్లూరి కి అందజేశారు. గత నాలుగు దశాబ్దాలు పైగా పెడన పట్టణ పరిసర ప్రాంత పేద ప్రజలకు డా. కొల్లూరి అందిస్తున్న నిస్వార్థ సేవలకు గాను ఈ అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో ఏడు రాష్ట్రాలకు చెందిన 200 మంది పాల్గొని వివిధ రంగాలలో అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల చైర్మన్ మామిడి వెంకట వరప్రసాద్ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం వైద్య శిబిరముల కమిటీ చైర్మన్ ఆత్మకూరి సురేష్ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం ఉపాధ్యక్షులు చిలకల బాలాజీ పెడన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి ఎండూరి కాంతారావు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా ప్రధాన కార్యదర్శి కే టీ మురళీకృష్ణ ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు ఉత్సవ కమిటీ కన్వీనర్ కొల్లూరి రాధాకృష్ణ గుప్తా ఆర్యవైశ్య యువజన సంఘం తక్షణ మాజీ అధ్యక్షులు చిట్టూరి పశుపతినాథ్ బాబు శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీ తాయారు ప్రధాన కార్యదర్శి మామిడి సావిత్రి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయ దుర్గ తదితరులు డా. కొల్లూరి కి అభినందనలు తెలియజేశారు.

# డ్యాన్స్ కాంపిటీషన్స్ పోస్టర్ రిలీజ్ చేసిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ




విజయవాడ, జులై 21(జర్నలిస్ట్‌ఫైల్):

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛ విజయవాడ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అవగాహన పెంచేందుకు డ్యాన్స్ కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఆదివారం సాయంత్రం హరిత బెరం పార్క్ లో డాన్స్ కాంపిటీషన్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొని పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఆదివారం జులై 27న హరిత బెరం పార్క్ లో డాన్స్ కాంపిటీషన్స్ ప్రారంభం అవుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి వయసు గల వారికి వివిధ కేటగిరీలు ఉంటాయని, మొదటి క్యాటగిరిలో 6 కంటే తక్కువ వయసు, ఏడు నుంచి పది వయసుగల వారు రెండో కేటగిరీ, 11 నుండి 15 వయసు గల వారు మూడో క్యాటగిరి, 16 సంవత్సరాలు కంటే ఎక్కువగా ఉన్నవారు నాలుగో కేటగిరీలో డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోలో మరియు గ్రూప్ పర్ఫామెన్స్ లు క్లాసికల్ మరియు జనరల్ క్యాటగిరిలలో ఈ పోటీ కేటగిరీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు విజయవాడ నగర పాలక సంస్థ వారి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన పోస్ట్ లో ఉన్న రిజిస్ట్రేషన్ లింక్ ను క్లిక్ చేసి, వివరాలు నింపి రిజిస్టర్ చేసుకోగలరని తెలిపారు. లేదా కోడ్ ని స్కాన్ చేసి రిజిస్టర్ చేసుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కె. చైతన్య, వెస్ట్ ఎమ్మార్వో షేక్ ఇంతియాజ్, విజయవాడ నగరపాలక సంస్థ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతి,రాష్ట్ర అభివృద్ధికై..చంద్రబాబు అడుగులు

## లంకలితీష్ ఆధ్వర్యంలో 91 బూత్ లో ఇంటింటికి ప్రచారం



మైలవరం, జులై 21(జర్నలిస్ట్‌ఫైల్):

పేదల అభ్యున్నతి, రాష్ట్ర అభివృద్ధికై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు నిరంతరం పనిచేస్తున్నారని మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ అన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మైలవరం పట్టణంలోని పెద్ద హరిజనవాడ లోని 91 బూత్ లలో ఇంటింటికి తిరుగుతూ టీడీపి నాయకులు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న చేయబోయే సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు నేతలు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మ ఆసరాతో బంగారు భవితకు బాసట

- అమ్మ అసోసియేషన్ సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి
- కష్టపడి, ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి
- పేదరికం లేని సమాజ నిర్మాణానికే పీ4 విధానం
- అమ్మ స్ఫూర్తితో మరెందరో మార్గదర్శులు ముందుకురావాలి
- అమ్మ చూపే మార్గంతో బంగారు కుటుంబాలలో వెలుగులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




విజయవాడ, జులై 21 (జర్నలిస్ట్ ఫైల్) :

వ్యాపారం, వాణిజ్యం, కళలు.. వంటి అన్ని రంగాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగిన విజయవాడలో పేద కుటుంబాల పిల్లలు బాగా చదువుకొని, ఉన్నతంగా ఎదగడానికి ఆర్థిక సమస్యలు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో అమ్మ అసోసియేషన్ అందిస్తున్న ప్రోత్సాహం వెలకట్టలేనిదని, అమ్మ సహకారం చిన్నారుల బంగారు భవితకు బాసటగా నిలుస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఆధ్వర్యంలో ఆదివారం మొగల్రాజపురం అమ్మ కళ్యాణమండపంలో పేద కుటుంబాల విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ అసోసియేషన్.. ఆటోమొబైల్ రంగంలో పనిచేసే కుటుంబాలను అమ్మలా ఆదరిస్తోందని, మూడు దశాబ్దాలుగా క్రమంతప్పకుండా చిన్నారులకు ఉపకారవేతనాలు అందించడం ఎందరికో స్ఫూర్తినిస్తోందన్నారు. ఈ ఏడాది 408 మందికి రూ. 16.50 లక్షలు ఉపకారవేతనాలతో పాటు నోటు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం గౌరవ ముఖ్యమంత్రి పీ4 విధానాన్ని తీసుకొచ్చారని.. దాదాపు 300 బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా వ్యవహరించి, ఆ కుటుంబాలను అన్ని విధాలా పైకి తీసుకొచ్చేందుకు అమ్మ అసోసియేషన్ ముందుకురావడం అభినందనీయమని.. ఈ స్ఫూర్తితో మరింత మంది వ్యక్తులు, ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు మార్గదర్శులుగా ముందుకురావాలని కోరుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 86 వేల బంగారు కుటుంబాలు ఉన్నాయని.. ఈ కుటుంబాలే భవిష్యత్తులో ఏదో ఒక రోజు మార్గదర్శులు స్థాయికి ఎదిగేలా చేయూతనివ్వాలన్నారు. తమ కుటుంబం వెనుక ఓ పెద్ద మనిషి ఉన్నారనే ధైర్యమే పేద కుటుంబాలకు పెద్ద భరోసా అని.. ఆ ధైర్యమే వారిని ముందుకు నడుపుతుందన్నారు. అవసరమైన వైద్య సేవలు అందించడం, మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య మునిసిపల్ పాఠశాలను దత్తత తీసుకుని సకల సౌకర్యాలు కల్పించడం, నాణ్యమైన విద్య అందేలా ప్రోత్సహించడం, విపత్తుల సమయంలో సహాయకార్యక్రమాలు చేపట్టం ఇలాఅమ్మచేస్తున్నకృషి అభినందనీయమన్నారు.

### మాదక ద్రవ్యాలు, ప్లాస్టిక్ వినియోగంపైనా అవగాహన కల్పించండి

మాదక ద్రవ్యాలు మనిషి జీవితాలను, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయని, అదేవిధంగా విచ్చలవిడిగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల పర్యావరణంతో పాటు మనిషి ఆరోగ్యానికీ పెను ప్రమాదం ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఈ నేపథ్యంలో అమ్మా అసోసియేషన్ ద్వారా మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర ఏ 2047 సాకారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గారపాటి సతీష్‌బాబు మాట్లాడుతూ అమ్మ అసోసియేషన్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆటోనగర్, గవర్నర్‌పేటలో ఆటోమొబైల్ దుకాణాల్లో పనిచేసే సిబ్బంది, కుటుంబాల విద్యార్థులకు ఇప్పటివరకు రూ. కోటికిపైగా ఆర్థిక సహాయంతో పాటు నోట్ పుస్తకాలను అందించడం జరిగిందన్నారు. కానూరులో రూ. 60 లక్షలతో వృద్ధాశ్రమాన్ని నిర్మించి అనేకమంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో, బుడమేరు వరదల సమయంలోనూ ఇలా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఓ సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన డా. జి.లక్ష్మీశ ఈరోజు ఓ ఐఏఎస్ అధికారిగా ప్రజలకు సేవల చేసే స్థాయికి ఎదగడం మనందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గోనుగుంట వెంకట సుబ్బారావు, దోనేపూడి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి కె.దుర్గామల్లికార్జునరావు, కార్యవర్గ సభ్యులతో పాటు అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మిరియాల వెంకటేశ్వరరావు, జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డా. వెల గాజోషి, విద్యార్థినీవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కార్యకర్త కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటాం

ఆగిరిపల్లి, జులై 21(జర్నలిస్ట్‌ఫైల్):

ఆగిరిపల్లి మండలం, నెక్కలం గొల్లగూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పటాపంచుల గంగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మరణించడం తెలుసుకొని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి వారి కుటుంబ సభ్యులను కలిసి,పేరు, పేరున పరామర్శించి, వారి కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పి ఓదార్చిన మంత్రి పార్థ సారథి ఓదార్చారు. గంగరాజు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. గంగరాజు తెలుగుదేశం పార్టీకి విధేయుడుగా ఉంటూ పార్టీ నిర్వహించే ప్రతీ కార్యక్రమంలో పాల్గొంటూ పార్టీకి ఎన్నో సేవలు చేసారన్నారు. అలాంటి కుటుంబానికి ప్రభుత్వం అన్ని వేళలా ఆదుకుంటుందని మంత్రి అన్నారు. గంగరాజు కుటుంబానికి ప్రభుత్వం తరపున అందే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించడంలో నా వంతు సహాయ,సహకారాలు అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

# బెజవాడ శ్రీను కుటుంబ శ్రేయోభిలాషి మంత్రి కొలుసు పార్థసారథి



ఆగిరిపల్లి, జులై 21(జర్నలిస్ట్‌ఫైల్):

ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బెజవాడ శ్రీను తల్లి ఇటీవల మరణించడం తెలుసుకొని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి వారి కుటుంబ సభ్యులను కలిసి,పేరు, పేరున పరామర్శించి, వారి కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పి ఓదార్చిన మంత్రి, బి, శ్రీను కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అదుకుంటుందన్నారు. శ్రీను కుటుంబానికి ప్రభుత్వం తరపున అందే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించడంలో నా వంతు సహాయ,సహకారాలు అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు,కుటుంబ సభ్యులు తమ, కృతజ్ఞను చాటారు, మంత్రి వెంట తెలుగుదేశం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని ఆరాధనలలో కన్నా అన్న సమారాధన మిన్న





- రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- రాజమహేంద్రవరం 49వ వార్డులోని సుబ్బారావు నగర్ వీధిలో 32వ శ్రీ దుర్గా దానవాయి బాబు నాగమ్మ తల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి దుర్గేష్
- అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్
- నారాయణపురం గెయిల్ ఆఫీస్ ప్రక్క రోడ్డులోని కోట సత్తెమ్మ, లక్ష్మీదేవి ఆలయాన్ని సందర్శించి ఆషాడమాస కుంకుమ పూజా మహోత్సవంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్
- కొంతమూరులో కొలువై ఉన్న కనకదుర్గమ్మ దేవిని దర్శించుకున్న మంత్రి దుర్గేష్
- అనంతరం జాతర వేడుకల్లో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించిన మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, జులై 21(జర్నలిస్ట్‌ఫైల్):

అన్ని ఆరాధనలలో కన్నా అన్న సమారాధన మిన్న అని అందుకే అన్నాన్ని పరబ్రహ్మ స్వరూపమని అంటారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆషాడ మాసం చివరి ఆదివారం కావడంతో మంత్రి కందుల దుర్గేష్ పలు అమ్మవారి ఆలయాలను, ఇతర ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత ఆలయ అధికారులు మంత్రి దుర్గేష్ కు పూర్ణ కుంభాలతో ఘన స్వాగతం పలికారు. తొలుత రాజమహేంద్రవరం 49వ వార్డు భవానీపురంలోని సుబ్బారావు నగర్ వీధిలో 32వ శ్రీ దుర్గా దానవాయి బాబు నాగమ్మ తల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొని అనంతరం అన్నసమారాధనలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఆ తర్వాత నారాయణపురం గెయిల్ ఆఫీస్ ప్రక్క రోడ్డులోని కోట సత్తెమ్మ, లక్ష్మీదేవి ఆలయాన్ని సందర్శించి ఆషాడమాస కుంకుమ పూజా మహోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భవానీపురంలోని సంతోష్ నగర్ దగ్గర కొంతమూరులో కొలువై ఉన్న కనకదుర్గమ్మ దేవిని దర్శించుకున్న మంత్రి దుర్గేష్ అనంతరం జాతర వేడుకల్లో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ భగవంతున్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ భగవంతుడి సేవలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ పదిమంది ఆకలి తీర్చడం నిజంగా ఒక అదృష్టమని, పేద ప్రజలకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. దైవ కార్యక్రమాలతో పాటు సామాజిక సేవ అలవాటు చేసుకోవాలన్నారు. ఆలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడం, పండుగలు, విశేష దినాల్లో చేస్తున్న ఏర్పాట్లు బాగున్నాయని మంత్రి దుర్గేష్ అన్నారు.

# వర్షాకాల సమావేశాల్లోనే జస్టిస్ వర్మపై అభిశంసన!





## 100 మందికిపైగా ఎంపీల సంతకాలు

## కరెన్సీ నోట్ల గుట్టల కేసు

**న్యూఢిల్లీ,జూలై 21 :** జడ్జిఇంట్లో నోట్లకట్టల వ్యవహారంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే ఆయనపై ప్రవేశపెట్టిన తీర్మానానికి 100 మందికిపైగా ఎంపిలు సంతకాలుచేసారని కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. ఇప్పటికే కొల్లీజియం సిఫారసుచేయడం, మాజీ చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా హయాంలో ప్రభుత్వానికి ఆయన్ను తొలగించాలని సిఫారసులుచేయడం జరిగాయి. దీనికి ముందు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన కమిటీ జస్టిస్ వర్మ, అటు పోలీసులు మొత్తం అందరినుంచి వాంగ్మూలాలను సేకరించింది. త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు చీఫ్‌జస్టిస్ ఇచ్చి, సంజాయిషీ నోటీసులకు వర్మ జవాబులు ఇవ్వలేదు. పైగా ఇపుడు అభిశంసన తీర్మానంపై ఆయన సుప్రీంకోర్టు మెట్లెక్కారు. ఆయన పిటిషన్ విచారణకు రావాల్సి ఉంది. ఈతరుణంలో ఈసమావేశాల్లోనే జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడం, ఆ తీర్మానంపై చర్చించడం ఆపై పార్లమెంటు నిర్ణయం వంటివి వెలువడనున్నాయి. మార్చి 14న జస్టిస్ వర్మ వెకేషన్‌కు వెళ్లగా ఆయన నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైర్ సిబ్బందికి ఆయన ఇంట్లో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. ఈ విషయాన్ని ఎవరికి చెప్పవద్దని జస్టిస్ వర్మ కుమార్తె వారికి చెప్పారు.దీంతో ఈ విషయాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుంది. వెంటనే సుప్రీంకోర్టు కొలీజియం ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసి ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించలేదు. త్రిసభ్య కమిటీ విచారణ జరిపింది. ఈ కమిటీలో పంజాబ్, హరియాణా హైకోర్టు దిరి జస్టిస్ షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ జస్టిస్ జీఎస్ సంధవాలియా, కర్నాటక హైకోర్టు అనుశివరామన్‌తో ఈ కమిటీ ఏర్పాటైంది. పదిరోజుల తర్వాత జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమేనని కమిటీ రిపోర్టు నిర్ధరించింది. ఆ రిపోర్టు ఆధారంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 8న ఆయనపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి లేఖ రాశారు. 25 పేజీల రిపోర్టు కాపీని దిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ నివేదిక ఆధారంగా ప్రస్తుతం పార్లమెంట్‌లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం ఎంపీల సంతకాల సేకరణ ప్రక్రియను ప్రారంభించారు. న్యాయమూర్తుల అభిశంసన ప్రక్రియ జడ్జెస్ ఎంక్వైరీ యాక్ట్ 1968 ప్రకారం జరుగుతుంది. ఈ ప్రక్రియ చాలా కఠినంగా, వివిధ దశల్లో ఉంటుంది. మొదటగా పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెడతారు. దీన్ని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. లోక్‌సభలో కనీసం 100 మంది సభ్యులు సంతకం చేసిన నోటీసును స్పీకర్‌కుఇవ్వాలి. రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యులు సంతకం చేసిన నోటీసును ఛైర్మన్‌కు ఇవ్వాలి.

తీర్మానాన్ని ఆమోదించాక స్పీకర్ లేదా ఛైర్మన్ ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా భారత ప్రధాన న్యాయమూర్తి, ఏదైనా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఒక సీనియర్ న్యాయ నిపుణుడు ఉంటారు. పార్లమెంటులో జరిగే ప్రక్రియలో ఈ కమిటీ సదరు న్యాయమూర్తిపై వచ్చిన ఆరోపణలపై విచారిస్తుంది. సాక్ష్యాలను సేకరిస్తుంది. అంతే కాకుండా ఆ న్యాయమూర్తికి తన వాదనను వినిపించేందుకు అవకాశం కల్పిస్తుంది. విచారణ పూర్తయిన తర్వాత, కమిటీ తన నివేదికను స్పీకర్ లేదా ఛైర్మన్‌కు సమర్పిస్తుంది. నివేదికలో న్యాయమూర్తిపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలితే అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటులో చర్చకు పెడతారు. చర్చ అనంతరం ఉభయ సభలు తీర్మానాన్ని ప్రత్యేక మెజారిటీతో ఆమోదించాలి. అంటే సభకు కనీసంగా 50 శాతం మంది హాజరవ్వాలి. అందులో మూడింట రెండొంతుల మెజారిటీ ఓట్లు పడితే ఆ సభలో తీర్మానం ఆమోదం పొందుతుంది. తర్వాత, తీర్మానాన్ని మరొక సభకు పంపుతారు. అక్కడా ప్రత్యేక మెజారిటీతో ఆమోదం పొందాల్సి ఉంటుంది. రెండు సభలు తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత దాన్ని రాష్ట్రపతికి పంపిస్తారు. రాష్ట్రపతి అప్పుడు ఆ న్యాయమూర్తిని పదవి నుంచి తొలగించడానికి ఆదేశాలు జారీ చేస్తారు. ఈ అంశంలో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదు. ఇది పూర్తిగా పార్లమెంటులో జరిగే ప్రక్రియ. ఈ విషయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టత నిచ్చారు.

# మానాన్నే మళ్లీ బీహార్ సిఎం

## సిఎం నితీష్ తనయుడు నిశాంత్



**పాట్నా,జూలై 21:** బీహార్ ఈ ఏడాది చివరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, తన తండ్రి నితీష్ కుమార్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని ఆయన కుమారుడు నిషాంత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి, ప్రజలకు నితీష్ ఎంతో చేశారని, ప్రజలు ఎన్డీయేను గెలిపించి మరోసారి ప్రజాసేవచేసే అవకాశం ఆయన కల్పిస్తారని పాట్నాలో ఆదివారంనాడు మీడియాతో మాట్లాడుతూ నిషాంత్ చెప్పారు. మళ్లీ మా నాన్నగారే సిఎం అవుతారు. ప్రభుత్వాన్ని ఎన్డీయే ఏర్పాటుచేస్తుంది. గత 20ఏళ్లుగా ఆయనచేసిన సేవలు, పనులకు గుర్తింపుగా మరోసారి నితీష్ కుమార్‌ను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపిస్తా రనే నమ్మకం నాకుంది అని నిశాంత్ తెలిపారు.

రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలంగా సేవలందించిన 75 ఏళ్ల నితీష్ కుమార్ మరోసారి అధికారాన్ని ఆశిస్తున్నారు. బిజెపి సారథ్యంలోని ఎన్డీయేలో జెడియూ, చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ భాగస్వామిగా ఉన్నాయి. ఈసారి నితీష్ కుమార్ ఇండియా కూటమి నుంచి గట్టిపోటీని ఎదుర్కొనే అవకాశం ఉంది. తేజస్వి యాదవ్ రాష్ట్రీయ జనతాదళ్, కాంగ్రెస్, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ, వామపక్షాలు ఇండియా కూటమిలో ఉన్నాయి. నితీష్ పాపురాలిటీ తగ్గుతోందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు ఆయన సారథ్యం వహించక పోవచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే బీహార్‌లో ఎన్డీయేకు నితీష్ సారథ్యం వహిస్తారని బిజెపి స్పష్టత ఇచ్చింది. నితీష్ కుమార్ 2013లో ఎన్డీయేను విడిచిపెట్టి తన చిరకాల ప్రత్యర్థి లాలూ ప్రసాద్ యాదవ్‌తో చేతులు కలిపారు. 2017లో ఆర్జేడీని వీడి తిరిగి ఎన్డీయేలోకివచ్చారు. 2022లో తిరిగి ఎన్డీయేతో తెగతెంపులు చేసుకుని ఆర్జేడీతో కలిసారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మరోసారి ఆయన పీఎం మోడీక్యాంపులోకి వచ్చిచేరారు.

# వర్షాకాల సమావేశాల్లో ఎన్డీయేను ఇరుకునపెట్టే వ్యూహాం

## విపక్ష కూటమి వర్చువల్ భేటీ

**న్యూఢిల్లీ,జూలై 21:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో బిజెపినేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ఇండియా కూటమి సన్నద్ధమైంది. ఈ మేరకు ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించింది. ఇండియా కూటమి కూటమికి చెందిన 24 రాజకీయ పార్టీల నేతలు వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నిలిపివేత, ట్రంప్ మధ్యవర్తిత్వం, బీహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక పునర్విశ్లేషణ ప్రక్రియ తదితర అంశాలపై పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీయాలని నిర్ణయించారు. మీటింగ్ తర్వాత సమావేశానికి సంబంధించిన వివరాలను కాంగ్రెస్‌నేత ప్రమోద్ తివారీ మీడియాకు వెల్లడించారు. మోడీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను విస్మరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా తాము ఐక్యంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను లేవనెత్తుతామని తివారి స్పష్టంచేసారు. పార్లమెంట్ సజావుగా జరగాలని, తమ ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తాల్సిన 8 ప్రధాన అంశాలపై తీర్మానం చేశారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి సంబంధించి ప్రభుత్వ వైఫల్యంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం. ఆపరేషన్ సింధూర్‌ను ఆకస్మికంగా నిలిపివేయడం వెనుక గల కారణాలు ఏంటి?కాల్పుల విరమణ, వాణిజ్యంపై డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరడం. బిహార్‌లో ఎస్ఐఆర్ పేరుతో జరుగుతున్న ఓటుబ్యాంకు రాజకీయాలపై నిలదీయడం పాకిస్థాన్, చైనా, గాజా వంటి అంశాలపై ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని ప్రశ్నించడం. డీలిమిటేషన్ ప్రక్రియ, దాని ప్రభావాలపై చర్చ. దేశంలో దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీ వర్గాలపై జరుగుతున్న అణచివేత సమస్యలను లేవనెత్తడం. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ప్రభుత్వం నుంచి సమాధానం కోరడం. అలాగే, న్యాయమూర్తులు యశ్వంత్ వర్మ, శేఖర్ యాదవ్ కేసులను కూడా లేవనెత్తాలని కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీల నాయకులు ఈ సమావేశంలో తీర్మానించారు. బీహార్‌లో ఎస్ఐఆర్ పేరిట లక్షలాదిగా ఓటర్ల పేర్లు తొలగించడం కేంద్రం దుశ్చర్యగా విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే కుట్రగా దీన్ని పేర్కొన్నారు. ఇదొక అప్రకటిత ఎమర్జెన్సీగా అభివర్ణించారు. చైనా, పాకిస్థాన్, గాజా వంటి కీలక అంతర్జాతీయ అంశాల్లో భారత ప్రభుత్వం మౌనంగా ఉండటం విదేశాంగ పరంగా పరాజయమేనని కూటమి అభిప్రాయపడింది.

ఈ అంశాలపై పార్లమెంట్‌లో చర్చలు జరిగితే ప్రధాని నేరుగా హాజరై సమాధానం చెప్పాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల కేరళలో చేసిన వ్యాఖ్యలపై లెఫ్ట్ పార్టీలు అసహనం వ్యక్తం చేశాయి. ఆర్ఎస్ఎస్, లెఫ్ట్‌ను ఒకే గాటిన కట్టి రాహుల్ గాంధీ విమర్శించడంతో ఈ సమావేశంలో కమ్యూనిస్టు నేత డి.రాజా అభ్యంతరంచెప్పారు.

నిఘా వైఫల్యం ఉన్నప్పటికీ ఐబీచీఫ్‌కు ఎందుకు పదవీకాల పొడిగింపు ఇచ్చారనిప్రశ్నించారు. చోటుచేసుకుంది. కొంతకాలంగా ఇండియా కూటమికి దూరంగా ఉన్న టిఎంసి ఈ మీటింగ్‌కు హాజరైంది. వాస్తవానికి ఈ సమావేశం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరగాల్సి ఉంది, అయితే కొంతమంది ముఖ్య నాయకులు దిల్లీలో అందుబాటులో లేకపోవడం వల్ల వర్చువల్‌గా నిర్వహించారు.

# మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఫోన్‌లో 'రమ్మీ' ఆడిన మంత్రి!



**ముంబై, జూలై 21:** ఒకపక్క అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా.. మరోవైపు ఆ రాష్ట్ర మంత్రి తన సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడారు. దీనిని సంబంధించిన విడియో నెట్టింట వైరల్‌గా మారింది. మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్‌రావు కోకాటె.. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఫోన్‌లో రమ్మీ ఆడుతున్నారని ఎన్సీపి (శరద్‌పవార్‌వర్గం) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా దీనికి సంబంధించిన విడియోలను పంచుకున్నారు.రైతులు, వ్యవసాయ సమస్యల గురించి సభలో చర్చలు జరుగుతున్న సమయంలో రాష్ట్ర మంత్రి ఇలా వ్యవహరించారని మండిపడ్డారు. రాష్ట్రంలో రోజుకు 8 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. అయినప్పటికీ వ్యవసాయ మంత్రి వీటన్నింటినీ పట్టించుకోకుండా ఆటలాడాతున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి మంత్రులున్న ప్రభుత్వం.. పంట బీమా, రుణ మాఫీ, మద్దతు ధరల కోసం రైతులుచేసే డిమాండ్లను ఏం వింటుందని విమర్శించారు. అప్పుడప్పుడు పేద రైతుల పొలాలను సందర్శించండి మహారాజా అంటూ కోకాటెపై.. రోహిత్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనికిసంబంధించిన విడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

ఇక, ఈ సంఘటనపై ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టడం లేదని ఆరోపిస్తున్నాయి. దీనిపై శివసేన (యుబిటి) ప్రతినిధి ఆనంద్ దూబే స్పందిస్తూ.. మంత్రి కోకాటె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి ఇప్పటివరకూ స్పందించలేదు.



## 20యేళ్లుగా కోమాలో ఉన్న యువరాజు కన్నుమూత

**దుబాయి,జూలై 21 :** కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గడిచిన 20 ఏళ్లుగా కోమాలో ఉన్న సౌదీ యువరాజు అల్ వలీద్ బిన్ ఖాలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ మృతిచెందారు. ఆయన వయసు ప్రస్తుతం 36 సంవత్సరాలు. శనివారం అల్ వలీద్ కన్నుమూశాడని 'గ్లోబల్ ఇమామ్స్ కౌన్సిల్ తెలిపింది. సుదీర్ఘ కాలం కోమాలో ఉండటంవల్ల అల్ వలీద్ 'స్లీపింగ్ ప్రిన్స్'గా వార్తల్లో నిలిచారు. దాదాపు ఇరవై ఏళ్లుగా కోమాలో ఉన్న ఆయన సుదీర్ఘ పోరాటం తర్వాత కన్నుమూశారని గ్లోబల్ ఇమామ్స్ కౌన్సిల్ పేర్కొంది. ఈ విషాదం నుంచి ఆ కుటుంబం త్వరగా కోలుకునే ధైర్యం భగవంతుడు ఇవ్వాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపింది. సౌదీ యువరాజు అల్ వలీద్ 1990 ఏప్రిల్‌లో సౌదీ రాజు ఖాలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ దంపతులకు జన్మించారు. ఆయన బ్రిటన్‌లోని మిలిటరీ కాలేజీలో చదువుతుండగా 2005లో ఓ కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి కోమాలో ఉన్న యువరాజుకు రియాద్‌లోని ఓఆస్పత్రిలో చికిత్స అందించారు. ట్యూబ్ ద్వారా ఆహారం అందించేవారు. వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నప్పటికీ కోలుకునే అవకాశం లేదని భావించి 2015లో దాన్ని తొలగించాలని వైద్యులు సిఫార్సు చేశారు. ఆయన తండ్రి అందుకు నిరాకరించారు. అయితే 2019 లో వలీద్ ఒసారి కోలుకున్నట్లు కనిపించారు. కానీ ఆ తర్వాత ఆయన స్థితిలో ఎలాంటి పురోగతి కనిపించలేదు.

## నాలుగేళ్లుగా సహజీవనం పెళ్లిదాకా వచ్చేసరికి హత్య

**అహ్మదాబాద్,జూలై 21:** ఆమె అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్, అతడేమో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్.. నాలుగు సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నారు. కొంతకా లంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండగా శుక్రవారం రాత్రి ఆగ్రహం పట్టలేక ప్రియుడు ఆమె గొంతుకోసి చంపేసి ఆమె పనిచేస్తున్న పోలీస్ స్టేషన్‌కే వెళ్లి లొంగిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం అంజార్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అరుణాబెన్ నతుభాయ్ జాదవ్‌కు దిలీప్ డాంగ్చియాతో ఇన్ స్టాలో పరిచయం ఏర్పడింది. అదికాస్తా ప్రేమగా మారడంతో ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. వివాహం చేసుకునే విషయంపైనే రెండురోజులక్రితం ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో దిలీప్ ఆగ్రహం పట్టలేక అరుణా బెన్ గొంతుకోశాడు.

# రష్యాతో శాంతిచర్చలకు సిద్ధమే!



## ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లదీమిర్ జెలెన్‌స్కీ

**క్యీవ్, జూలై 21 :** రష్యాతో గత నెలలో నిలిచిపోయిన శాంతి చర్చలను తిరిగి ప్రారంభించేందుకు తాము ఉన్నామని ఉక్రెయిన్ ప్రకటించింది. రష్యాతో వచ్చే వారం చర్చలు జరిపేందుకు అధికారిక ప్రతిపాదనను పంపినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లదిమిర్ జెలెన్ స్కీ ధృవీకరించారు. దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ చర్చల ప్రతిపాదనను జాతీయ భద్రతా మండలి కార్యదర్శి రుస్తెమ్ ఉమెరోవ్ రష్యా ప్రతినిధులకు అందించారని జెలెన్ స్కీ తన ప్రసంగంలో తెలిపారు. యుద్ధాన్ని ఆపేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయని పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో రష్యా వెనుకడుగు వేస్తోందని విమర్శించారు. రష్యా ఇలా చేయడం ఒత్తిడిపెంచి ఆపాలని స్పష్టం చేశారు. పుతిన్‌తో ముఖాముఖి సమావేశానికి తాను సిద్ధంగా ఉన్నానని జెలెన్ స్కీ పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య శాశ్వత శాంతి కోసం నాయకత్వ స్థాయిలో ఒక సమావేశం అవసరమని ఆయన నొక్కి చెప్పారు. అయితే అమెరికా ఒత్తిడితోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఈ చర్చల ప్రతిపాదనను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై రష్యా ఇప్పటివరకు ఎటువంటి స్పందన ఇవ్వలేదు. అయితే క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఇటీవల మాట్లాడుతూ, శాంతి చర్చలకు మరింత ఇరు దేశాల నాయకుల మధ్య మరింత చొరవ అవసరమన్న జెలెన్ స్కీ వ్యాఖ్యలతో తాము ఏకీభవిస్తున్నామన్నారు. ఉక్రెయిన్ మాజీ రక్షణ మంత్రి అయిన రుస్టెమ్ ఉమెరోవ్ గతవారం నేషనల్ సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ అధిపతిగా నియమితులయ్యారు. ఈ క్రమంలో చర్చలకు సంబంధించిన బాధ్యతలను ఆయనకు అప్పగించారు. ఈ ఏడాది ప్రారంభంలో టర్కీలో జరిగిన రెండు రౌండ్ల చర్చల్లోనూ ఆయన తన దేశ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. అయితే ఆ చర్చలు పెద్దగా సత్ఫలితాలను ఇవ్వలేదు.

# హెచ్1బి వీసా జారీలో సవరణలు




## శ్వేతసౌధం పరిశీలనలో ప్రతిపాదనలు

**వాషింగ్టన్,జూలై 21 :** హెచ్1బీ వీసాల ప్రక్రియలో మరో కొత్త అంశం తెర ముందుకు వచ్చింది. వీసా జారీ ప్రక్రియలో ట్రంప్ కార్యవర్గం కీలక మార్పులు చేసేందుకు నిర్ణయించింది. హెచ్1బీ వీసాలు జారీ పరిమితిని ఏటా కాంగ్రెస్ నిర్ణయిస్తుంది. ప్రస్తుతం అది 85,000గా ఉన్నాయి. వీటిలో 20,000 వీసాలు మాస్టర్స్ డిగ్రీ చేసిన వర్కర్ల కోసం రిజర్వు చేశారు. ఎలాంటి పరిమితిలేని వీసాలను విశ్వవిద్యాలయాల్లోని పరిశోధన విభాగాల కోసం జారీ చేస్తారు. ప్రస్తుతం ప్రాసెస్‌ను నిలిపివేసినట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ప్రకటించింది. అందుకు కారణం 2026 వార్షిక పరిమితికి తగినన్ని దరఖాస్తులు రావడం. దీంతో 2026 ఏడాదికి లాటరీ విధానం బహుశా ఉండకపోవచ్చు. లాటరీ విధానంలో వీసా దారులను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ తర్వాత ఆయా కంపెనీలు తమకు వచ్చిన వీసాల్లో, అక్టోబర్ నాటికి విధుల్లో చేరాల్సిన కార్మికుల దరఖాస్తులను సమర్పిస్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చాక సదరు పోస్టుకు ఆఫర్ చేస్తున్న వేతనం ఆధారంగా వీసాలు జారీ చేశారు. కంపెనీలు మరింత మంది ఉన్నత స్థాయి నిపుణులను నియమించుకొనేలా ప్రోత్సహించేందుకు ఈ విధానం అమలు చేసినట్లు తెలుస్తోంది. నాడు బై అమెరికన్, హైర్ అమెరికన్ అనే కార్యక్రమం కింద దీన్ని నిర్వహించారు. 2021లో జో బైడెన్ అధికారంలోకి వచ్చాక దీన్ని పక్కనపెట్టారు. ఇక తాజాగా డీహెచ్ఎస్ పంపిన ప్రతిపాదనపై దాదాపు వెయ్యి వరకు పబ్లిక్ కామెంట్లు వచ్చినట్లు సర్వేలు పేర్కొంటున్నాయి. దీని వల్ల హెచ్1బీ ఉద్యోగులు తక్కువగా అందుబాటులో ఉంటారని తెలిపింది. వాస్తవానికి ఏ కంపెనీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోకుండా ఈ లాటరీ విధానాన్ని తీసుకొచ్చారు. కానీ పెద్ద పెద్ద కంపెనీలు అధిక దరఖాస్తులు చేసి ఎక్కువ వీసాలను దక్కించుకొంటున్నాయి. ఈ లాటరీ విధానాన్ని తొలగించాలని ఈ ఏడాది జనవరిలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్రొగ్రెస్ అనే మేధోమథన సంస్థ సూచించింది. జీతం, సీనియార్టీ ఆధా రంగా వీసాలు జారీ చేస్తే వాటి ఆర్థిక విలువ 88 శాతం పెరుగుతుందని తెలిపింది.

# మూడుదేశాల్లో తీవ్రస్థాయి భూకంపాలు!

**మాస్కో జూలై 21 :** రష్యాలో భారీ భూకంపం సంభవించింది. రష్యా తీరంలో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెట్రోపవ్‌లావ్‌స్కీ కామ్చాట్కా నగరానికి 144 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు దాదాపు గంట వ్యవధిలోనే ఈ ప్రాంతంలో ఐదు భూకంపాలు నమోదైనట్లు యూఎస్‌జియోలాజికల్‌సర్వే తెలిపింది. వీటిలో 7.4 తీవ్రతతో కూడిన భూకంపం వల్ల సునామీ వచ్చే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. దీంతో కమ్చట్కా ద్వీపకల్పానికి పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు. ఇరాన్‌లో కూడా మరోసారి భూమి కంపించింది. ఆదివారం తెల్లవారుజామున ఉత్తర ఇరాన్‌లో భూకంపం వచ్చింది. దీని తీవ్రత 5.2గా నమోదయింది. మరోవైపు తజికిస్తాన్‌లో కూడా భూకంపం వచ్చింది. తెల్లవారుజామున 1 గంటలకు భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 160 కిలోమీటర్ల లోతులో ఉంది. భారత్‌లోని అస్సాంలోనూ భూ ప్రకంపణలు చోటుచేసుకున్నాయి. నాగావ్ జిల్లాలో2.9 తీవ్రతతో భూకంపం వచ్చింది.

# సంక్షిప్తంగా..

## మలేరియాపై పోరుకు ఐసిఎంఆర్ కొత్త టీకా



**న్యూఢిల్లీ, జూలై 21:** మలేరియాను నివారించడంలో భారత్ మరో ముందడుగు వేసింది. దేశంలో మలేరియాను రూపుమాపడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) అడ్‌ఫాల్సీవాక్స్ అనే బహుళ-దశల స్వదేశీ రీకాంబినెంట్ చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తోంది. ఐసిఎంఆర్ దాని ప్రాంతీయ వైద్య పరిశోధనా కేంద్రం, భువనేశ్వర్ (ఆర్ఎంఆర్‌సిబిబి), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ (ఎన్ఐఎంఆర్) ద్వారా బయో టెక్నాలజీ విభాగం-నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ (డిబిటి-ఎన్ఐఐ) భాగస్వామ్యంతో అడ్‌ఫాల్సీవాక్స్ అనే రీకాంబినెంట్ చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. అడ్‌ఫాల్సీవాక్స్ అనేది మలేరియాను కలిగించే ప్లాస్మోడియం పరాన్నజీవి రక్తంలో ఉన్న రెండు క్లిష్టమైన దశలను లక్ష్యంగా చేసుకోవడానికి రూపొందించిన మొట్టమొదటి చిమెరిక మలేరియా వ్యాక్సిన్.

## విమానం గాల్లో ఉండగానే ఇంజిన్‌లో మంటలు..

**వాషింగ్టన్, జూలై 21 :** విమానం గాల్లో ఉండగానే ఇంజిన్‌లో మంటలు చెలరేగిన ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. లాస్‌ఏంజెలెస్ నుంచి అట్లాంటాకు వెళ్తున్న డెల్టా ఎయిర్‌లైన్స్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పైలట్లు అప్రమత్తమవడంతో విమానం వెనక్కి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. డెల్టా ఎయిర్‌లైన్‌కు చెందిన బోయింగ్ 767-400 విమానం లాస్‌ఏంజెలెస్ నుంచి అట్లాంటాకు బయలుదేరింది. విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే సమస్య ఎదురైంది. ఎడమవైపు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఎయిర్‌పోర్టు సిబ్బందికి సమాచారం ఇచ్చి.. విమానాన్ని వెనక్కి మళ్లించారు. లాస్‌ఏంజెలెస్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దిగింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే రన్‌వేపైకి వచ్చి మంటలను అదుపు చేశారు.

## పాకిస్థాన్‌లో వర్ష బీభత్సం..200 మంది మృతి



**ఇస్లామాబాద్, జూలై 21 :** పొరుగు దేశం పాకిస్థాన్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. వర్షకాలంలో ముఖ్యంగా జూన్ నుంచి సెప్టెంబరు మధ్యకాలంలో పాక్‌లో భారీ వరదలు సంభవిస్తాయి. ఫలితంగా కొండచరియలు విరిగిపడుతూ, అపారనష్టం వాటిల్లుతుంటుంది. ఇటువంటి విపత్తుల కారణంగా ఇటీవలి కాలంలో 100 మంది పిల్లలతోసహా 200 మందికిపైగా జనం ప్రాణాలను కోల్పోయారని, 500 మందికిపైగా జనం గాయపడ్డారని పాకిస్థాన్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్ఎండిఎ) తెలిపింది. అధికారిక డేటా ప్రకారం.. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యధికంగా 123 మంది మృత్యువాత పడ్డారు. అలాగే ఖైబర్ పఖ్తుంఖ్వాలో 40, సింధ్‌లో 21, బలూచిస్తాన్‌లో 16, ఇస్లామాబాద్, పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూకాశ్మీర్‌లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు.

## పెట్రోలింగ్ చేస్తున్న ఏడుగురు పోలీసులు అదృశ్యం..

**పెషావర్, జూలై 21 :** పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఏడుగురు పోలీసు సిబ్బంది అదృశ్యమైన ఘటన పాక్‌లో కలకలం రేపుతోంది. పాకిస్థాన్‌లోని వాయువ్య ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఈ ఘటన చోటుచేసుకుంది. అఫ్ఘానిస్థాన్ సరిహద్దులోని సౌత్ వాజిరిస్థాన్ జిల్లాలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో ఏడుగురు పోలీసులు అదృశ్యమైనట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. వీరిలో ముగ్గురు లద్దా పోలీసుస్టేషన్‌కు చెందినవారు కాగా.. మిగతా నలుగురు సర్వాకై పోలీస్ స్టేషన్ పరిధిలోని టాంగా-చాగ్మాలి ప్రాంతంలో అదృశ్యమైనట్లు పేర్కొన్నారు. వీరిలో ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ కూడా ఉన్నట్లు తెలిపారు. పెట్రోలింగ్ చేస్తున్న సమయంలోనే వీరంతా అదృశ్యమయ్యారన్నారు. వారి ఆచూకీకి సంబంధించి తమకు ఇంకా ఎలాంటి అందలేదని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ సహకారంతో 22వ తేదీ అనగా మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఉదయం 09.00గం.ల నుండి 5.00గం.ల వరకు బ్రాడీపేట 3వ లైన్ మాస్టర్ మైండ్స్ క్యాంపస్ లో మెగా జాబ్ మేళా నిర్వహించబోతున్నామని, ఈ జాబ్ మేళాకు సుమారు 24 కంపెనీలు రాబోతున్నాయని, ఈ జాబ్ మేళాకు నెక్స్ జెన్, అపెక్స్, టాటా, ఆదిత్య బిర్లా, మెడ్ ప్లస్, జాయ్ అలూకాస్, వరుణ్ గ్రూప్, మాస్టర్ మైండ్స్, క్లేవాంట్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలు రాబోతున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# పారదర్శకంగా సామాజిక తనిఖీ



○ ఎంపిడిఓ యుగ కీర్తి

కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్) ఎం జి యన్ ఆర్ ఈ జి యస్ సామాజిక తనిఖీ లను సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఓ కే.యుగ కీర్తి తెలిపారు. మండల కేంద్రము అయిన కాకుమాను నందు నిర్వహించిన 18 వ సామాజిక తనిఖీ కు సంబంధించి సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా అధికారులు మాట్లాడుతూ 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన పలు రకాల పనులకు సంబంధించిన వివరాలు తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ సామాజిక తనిఖీ నందు పారదర్శకత పెంపొందించేందుకు సరికొత్త విధానాలను అవలంభిస్తుందన్నారు. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సామాజిక ,ఉపాధి హామీ ప్రతినిధులు సామాజిక తనిఖీ లలో మండల స్థాయిలో పటిష్ఠం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ యుగ కీర్తి, ఈ ఓ పి ఆర్ డి రవి బాబు, పి ఆర్ ఏ ఈ రవీంద్ర ,ఆడిట్ సిబ్బంది ఎస్ ఆర్ పి ఆవులయ్య, డి ఆర్ పి లు ,వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండల గ్రీవెన్స్ కు 10అర్జీలు

తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 అర్జీలు వచ్చినట్లు మండల తహసిల్దార్ కేవీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించే కార్యాచరణలో భాగంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుండి తహసిల్దార్ కెవి గోపాలకృష్ణ అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల ప్రజా సమస్యల పరిష్కార వేదికకు, పది,అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో నాలుగు రెవెన్యూ విభాగం సర్వేకు సంబంధించినవి, మిగిలిన అర్జీలు వ్యక్తిగత సమస్యలపై వచ్చిన అర్జీలుగా వివరించారు. సకాలంలో అర్జీల సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సంస్కారభారతి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కాటూరి



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) విశాఖపట్నం లోని B.V.R కళాశాల ఆవరణలో 20 వ తేదీ సాయంత్రం జరిగిన సంస్కార భారతీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమావేశంలో, రాష్ట్ర శాఖకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంస్కారభారతి సంస్థ రాష్ట్ర అధ్యక్షునిగా P.V.N.కృష్ణ, ఉపాధ్యక్షులుగా కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు , ప్రధాన కార్యదర్శిగా గుంటల రామ్ కుమార్, కార్యదర్శిగా P. రంగ మన్నార్, దృశ్యకళల సమయోజకులుగా అల్లు రాంబాబు నియమితులయ్యారు. కార్యక్రమానికి, రాష్ట్ర నలుమూలల నుంచి సంస్కార భారతి సభ్యులు హాజరయ్యారు, ముఖ్య అతిథిగా సంస్కార భారతీ అఖిల భారత కార్యదర్శి శ్రీ అసుతోష్ ఆడోని ( నాగపూర్ ) హాజరై, సంస్కార భారతి ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే కార్యాచరణ పైగురించి ప్రసంగించారు సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు, నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

# గంగమ్మ తల్లికి ఆషాడం సారే...



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) : నవులూరులో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గ్రామ బత్తుల వారి గంగమ్మ తల్లి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తాడికొండలోని బత్తుల వారి గంగమ్మ తల్లి దేవరకు ఆషాడ సారే సమర్పించడానికి మహిళా భక్తులు సారేతో ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. గ్రామంలో మహిళలు అమ్మవారి పసుపు, కుంకుమలు, పండ్లు, సారే, గ్రామానికి చెందిన బత్తుల నాగరాజు అమ్మవారికి సమర్పించిన ఆవు దూడతో ఊరేగింపు నిర్వహించారు. ఆయా గ్రామ కూడలిలలో అమ్మవారి సారే ఊరేగింపుకు మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో బిందెలతో నీరు వార పోశారు. ఊరేగింపు గ్రామంలోని రుద్రు వారి గంగమ్మ దేవర ఆలయం వం-కు ప్రదర్శన నిర్వహించి, అమ్మవారిని దర్శించుకొని, అనంతరం తాడికొండ బత్తుల వారి గంగమ్మ తల్లి దేవర ఆలయంకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బత్తుల నారాయణ, వెంకటేశ్వరరావు, నాగరాజు, శ్రీనివాసరావు, హరిబాబు, చక్రవర్తి, భాస్కర్, నాగేశ్వరరావు, బిక్షారావు, వెంకటేశ్వరరావు, యాదవ సంఘం నాయకులు రుద్రు శ్రీనివాసరావు, తోట శ్రీనివాస్ బాబు, దేశబోయిన వెంకటరావు, కొల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# యువ పోలీస్ అధికారులు టెక్నాలజీ మీద మరింత పట్టుసాధించాలి

○ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : యువ పోలీస్ అధికారులు టెక్నాలజీ మీద మరింత పట్టు సాధించాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (హైదరాబాద్) 77 ఆర్ ఆర్ బ్యాచ్ కు చెందిన 28 మంది ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారులు స్టడీ, కల్చరల్ టూర్ లో భాగంగా సోమవారం మంగళగిరి లోని ఆంధ్రప్రదేశ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర పోలీస్ ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి పోలీస్ ఉన్నతాధికారులు పోలీస్ శాఖలోని పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో అమలవుతున్న సంస్కరణలు, పోలీసింగ్ లో టెక్నాలజీ వినియోగం, నేరాల నియంత్రణ మరియు సైబర్ నేరాలను అరికట్టడానికి పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలు గురించి వివరించి అవగాహన కల్పించడం జరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వైజాగ్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'యోగాంధ్ర విజయవంతానికి తీసుకున్న చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ మరియు క్రౌడ్ కంట్రోలింగ్ కు వాడిన సాంకేతికతను గురించి ప్రొబెషనర్ ఐ.పీ.ఎస్. అధికారులకు వివరించారు.

అంతేకాకుండా ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ శాఖ రూపొందించిన "అస్త్రం" యాప్ గురించి, మహిళలు, బాలికల రక్షణకు రూపొందించిన శక్తి యాప్ "శక్తి టీమ్స్", రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఏర్పాటు చేసిన "ఈగల్ టీమ్స్ సాధిస్తున్న ఫలితాల, పనితీరు గురించి వివరించారు. నేరపరిశోధనలో "ఏఐ' వినియోగం గురించి, పోలీసింగ్ మరియు ప్రజాసేవలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలను అన్వేషించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఇటీవల అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "ఏఐ హ్యాక్ థాన్"వివరాలను తెలిపారు. ఇందులో అభివృద్ధి చేసిన పలు సాంకేతిక అంశాల మీద అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ టెక్నాలజీ పెరిగే కొద్దీ నేరస్తులు పోలీసు శాఖకు సరిక్రొత్త సవాళ్లను విసురుతున్నారన్నారు. వీటిని అధిగమించడానికి యువ పోలీస్ అధికారులు టెక్నాలజీ మీద మరింత పట్టుసాధించాల్సిందిగా సూచించారు. యువ ఐ.పీ.ఎస్ అధికారులు పోస్టింగ్ పొందిన ప్రాంతాల్లో స్థానిక భాషల మీద పట్టు సాధించాలని ఉద్బోధించారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెరపాలంటే భాషే మార్గమన్నారు. కెరీర్ కొత్తల్లో తాము ఎదుర్కొన్న సవాళ్లను, పోలీస్ శాఖలో ఎదురయ్యే వివిధ రకాల సమస్యలు, సవాళ్లపై తన స్వీయ అనుభవాలను యువ ఐ.పీ.ఎస్ అధికారులతో డీజీపీ పంచుకున్నారు.

అంతకు ముందు యువ ప్రొబెషనరీ ఐ.పీ.ఎస్ అధికారులకు APCRDA కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు ఆ శాఖ కమిషనర్ మరియు అడిషనల్ కమిషనర్ లు రాజధాని అమరావతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ (L & O) ఎన్. మధుసూధనరెడ్డి, ఐ.జీ.పీ. శ్రీకాంత్ (OPERATIONS& Technical Services), ఐ.జీ.పీ. బి. రాజకుమారి (W & CSW) ఐ.జీ.పీ. ఆకె రవికృష్ణ (EAGLE), డి.ఐ.జీ. సత్యయేసుబాబు (PTO & Training), డి.ఐ.జీ. పకీరప్పా (DIG L&O) తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వర్షాలపై జాగ్రత్త చర్యలు చేపట్టిన గుంటూరు నగరపాలక సంస్థ

○ కంట్రోల్ రూమ్ ఏర్పాటు - ప్రజలు సమస్యలు తెలపవచ్చు

○ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలపడం కోసం జిఎంసీలో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను 0863-2345103 నంబర్‌తో ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సోమవారం ఆయన శ్రీనగర్, పిఎస్.నగర్, బొంగరాలబీడు తదితర ప్రాంతాల్లో వర్ష ప్రభావిత ప్రాంతాలను పర్యటించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే పరిస్థితులు కనిపిస్తే, వెంటనే బెయిల్ అవుట్ చేసేందుకు తగిన మోటార్లు సిద్ధంగా ఉంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. త్రాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తుగా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, క్లోరిన్, ఆలం సరిపడిన మోతాదులో ఉండేలా నీటి శ్యాంపిళ్లను సేకరించాలని సూచించారు. డ్రైన్లలో నీటి నిల్వను నివారించేందుకు ప్రజారోగ్య కార్మికులను వ్యవస్థాబద్ధంగా కేటాయించి, నిరంతరం వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. డ్రైన్లపై ఆక్రమణలను తొలగిం చడంతో పాటు, పాత భవనాల్లో నివసిస్తున్న వారికి అవసరమైన భద్రతా సూచనలతో కూడిన నోటీసులు జారీ చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, జిఎంసి కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులపై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులకు స్పష్టంగా సూచించారు. ఈ పర్యటనలో డిఈఈ కళ్యాణరావు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిలో అవినీతి, భూకబ్జాలపై తహసీల్దార్‌కు వినతి




బ్రహ్మంగారిమఠం ( జర్నలిస్ట్ ఫైల్) బ్రహ్మంగారి మఠం మండలంలోని జాతీయ రహదారుల్లో జరిగిన పనులపై మరియు మండలంలో జరిగిన భూకబ్జాలపై విచారణ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం బి మఠం తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ కార్తీక్ కు సిపిఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలంలో 2014 నుండి ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు వందల ఎకరాలు ఆక్రమించి ఆన్లైన్ చేసుకున్నారని ఆక్రమణలు అడ్డుకోవలసిన రెవెన్యూ అధికారులు వారికి వత్తాసు పలుకుతూ కమిషన్లు తీసుకొని వారికి ఆ భూమిని ఆన్లైన్ చేయించి ఇచ్చారని మండలంలోని ఒక్కో పంచాయతీలో 200 ఎకరాల పైబడి భూ ఆక్రమణ జరిగిందని పలుకుబడి కలిగిన నాయకులు వందల ఎకరాలు బినామీల పేర్లతో ఆన్లైన్ చేయించుకుని ఆక్రమించుకుంటుంటే పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు రెండు ఎకరాలు ఇవ్వమని అడిగితే సంవత్సరాల తరబడి ఆఫీసు చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప వారికి న్యాయం చేయడం లేదని ఆయన ఆరోపించారు 2007 సంవత్సరం నుండి 2025 వరకు వందల ఎకరాలు ఐదు మంది ఎమ్మార్వోలు ఎవరికి తోచిన రీతిలో వారు ఆన్లైన్ చేసి భారీగా డబ్బులు సంపాదించుకొని వెళ్లారని ఏ ఒక్క ఎమ్మార్వో కూడా ఆక్రమణలను అడ్డుకునే స్థాయిలో పనిచేయలేదని ప్రస్తుతం వచ్చిన ఎమ్మార్వో ఏవైతే ఆక్రమణలో ఉన్న భూములను స్వాధీనం చేసుకొని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు కుటుంబానికి 2 ఎకరాలు భూమి ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా జాతీయ రహదారులు ఎన్హెచ్67 మరియు గ్రీన్ ఫీల్డ్ హైవే కేటాయించిన భూములలో భారీగా అవినీతి జరిగిందని రేకలకుంటకు సంబంధించిన వీఆర్వో సర్వేరు ముడమాల మల్లేపల్లి కి సంబంధించిన వీఆర్వో సర్వేర్లు కీలక పాత్ర పోషించారని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆస్తులకు కూడా ప్రైవేటు వ్యక్తుల అకౌంట్లో నిధులు జమ చేయించేలా చేశారని వీరిపై తక్షణమే విచారణ చేయాలని ఆయన పేర్కొన్నారు. ఆక్రమణలో గురైన భూములను స్వాధీనం చేసుకోకపోతే రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి సోమిరెడ్డిపల్లి నారాయణ, చేజర్ల రవి లు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ) : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రేకులకుంట పంచాయతీ బూత్ నెంబర్ 230 లక్ష్మీబాలాజీ నగర్ నందు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న బి.మఠం మండల మాజీ మండల అధ్యక్షులు మాలేపాటి సుబ్బారావు టిడిపి మండల యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జులు అమరావతి వెంకటసుబ్బయ్య పెరుగు వీరయ్య, టిడీపి కార్యకర్తలు జయన్న పెంచలయ్య కృష్ణయ్య పెరుగు పెద్ద వీరయ్యగుజ్జు రామాంజనేయులు పుటాల శివ యాదవ్ బ్రహ్మనాయుడు కిట్టి గారి వెంకటేశు రాజారత్నం నరసయ్య సిద్ధం డెన్నీ మల్లేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి




కడప జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్ ) రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెండింగ్లో ఉన్న 6400 కోట్ల రూ. వెంటనే విడుదల చేయాలని సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ లో %ఙ=ా% విశ్వేశ్వర నాయుడుకి వినతి పత్రం అందించిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం కాలం అవుతా ఉంది విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైంది. యువగళం పాదయాత్రలో విద్యార్థులకు అనేక హామీలు నారా లోకేష్ గారు ఇచ్చారు మా ప్రభుత్వం వచ్చిన వెంటనే జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని చెప్పి ఇప్పటివరకు దానిమీద స్పష్టమైన హామీ ఇవ్వలేదు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన విద్యార్థులకు ఫీజు నెంబర్స్మెంట్ వర్తింపచేయాలని, పాఠశాలలో విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి. పెండింగ్ లో ఉన్నా తల్లికి వందనం, విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు ఇవ్వాలని, మరియు పెండింగ్ లో ఉన్న పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక, ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు ప్రభుత్వ,ప్రైవేటు,కార్పోరేట్ విద్యాసంస్థలు విద్యార్థులు దగ్గర నుండి వేలకు వేలు ఫిజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పెండింగ్లో ఉన్న పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక విడుదల చేయాలి. అర్హులైన ప్రతి విద్యార్థులకు అందరికీ తల్లికి వందనం, విద్యాదివేన,వసతి దీవెన,పథకం వర్తింప చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం 9,10వ తరగతి చదువుతున్న బాలికలకు సైకిలు ఉచితంగా ఇవ్వాలనీ డిమాండ్. అలాగే సంక్షేమ హాస్టల్స్ లో, పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలనీ. రాష్ట్రప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలనీ, పెండింగ్లో ఉన్న కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలి. సంక్షేమ హాస్టల్ లో కూడా నాడు- నేడు పనులు ప్రారంభించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలి. జిల్లా వ్యాప్తంగా అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలనీ, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టు వర్కర్స్, పోస్ట్ లు భర్తీ చేయాలి. ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనారిటీ హాస్టల్ లో విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలి. మరియు అధిక ఫీజులు వసూలు చేసే కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఏవైతే రియంబర్స్మెంట్ బకాయిలు, జీవో నెంబర్ 77 ను రద్దుచేసి పేద విద్యార్థులందరికీ కూడా పీజీ అభ్యసించేలా చూడాలని లేనిపక్షంలో జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, నగర కార్యదర్శి మోహన్, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాస్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డు తప్పనిసరి



○ గుంటూరు నగర పాలక సంస్థ ప్రకటన

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ప్రతి వీధి వ్యాపారి నగరపాలక సంస్థ (జిఎంసి) జారీ చేసే గుర్తింపు కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గుర్తింపు కార్డు లేకుండా వీధి వ్యాపారానికి ఇకపై అనుమతి ఇవ్వబడదని ఆయన తెలిపారు. వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డుల జారీకి సంబంధించి దరఖాస్తుల స్వీకరణను ఈ నెల 25వ తేదీ వం-కు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిఎంసి ప్రధాన కార్యాలయం సహా అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేశారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కౌంటర్లు పని చేస్తాయని వివరించారు. సోమవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను ఉపా సెల్ పిఓ రామరావు పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, ఇప్పటికే నగరంలో వీధి వ్యాపారులపై సర్వే ముగిసిందని, కార్డు పొందిన వారిని మినహాయించి మిగిలిన వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

దరఖాస్తుకు పాస్ పోర్ట్ సైజు ఫోటో (విజ్ఞాపనదారుని వ్యాపారానికి సంబంధించినది), 14 ఏళ్లకు పైబడిన కుటుంబ సభ్యుల ఫోటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, బ్యాంకు ఖాతా నకలు, వ్యక్తిగత ఫోన్ నంబర్‌లు తప్పనిసరిగా జత చేయాలన్నారు. గుర్తింపు కార్డు పొందిన వారికి నగర పాలక సంస్థ ఏర్పాటు చేయనున్న వెండింగ్ జోన్లలో స్థల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. గుర్తింపు కార్డు లేని వారు వీధి వ్యాపారం చేయకూడదని హెచ్చరించారు.

# మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం




○ నల్లచెరువు మహావీర్ కాలేజీలో శక్తి బృందాల ప్రత్యేక సమావేశం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు జిల్లా లాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లచెరువు మహావీర్ కాలేజీలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గుంటూరు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పాల్గొని విద్యార్థినులకు వివిధ అంశాలపై మౌలికమైన సమాచారాన్ని అందించారు."మీ సంరక్షణ ం మా సంకల్పం" నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలికలపై జరిగే నేరాలు, వాటి నివారణ మార్గాలు, సంకట స్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, వేధింపులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి సమస్యలపై ఎలా స్పందించాలో, ముందస్తుగా ఏం జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. విద్యార్థినులు అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్ లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సూచించారు. శక్తి బృందాల కార్యకలాపాలపై కూడా స్పష్టతనిచ్చారు. మహిళ కానిస్టేబుళ్లతో కూడిన ఈ బృందాలు ఎల్లప్పుడు విద్యార్థినులకు అండగా నిలబడతాయని, అవసరమైతే వారి సేవలను వినియోగించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీతో పాటు సీఐ నారాయణ, మహిళా ఎస్సై ప్రమీల, శక్తి బృందాల సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థినుల్లో స్వయం రక్షణపై బలమైన అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందని కళాశాల అధ్యాపక వర్గం అభిప్రాయపడ్డారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## బ్రహ్మంగారి మాస కళ్యాణ మహోత్సవానికి దేవాదాయ మంత్రిని ఆహ్వానించిన ఫిట్ పర్సన్



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ దేవాదాయ శాఖ మంత్రి వర్యులు ఆనం రామనారాయణ రెడ్డిని ఆత్మకూరు లోని మంత్రి క్యాంప్ కార్యాలయం నందు కలిసి ఆగస్టు 6 వ తేదీన జరగనున్న శ్రీ మాతాగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మాసకల్యాణ మహోత్సవమునకు ఆహ్వానించడం జరిగినది. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ఈ యొక్క మాస కల్యాణంలో స్వామి వారి భక్తులు అందరూ కార్యక్రమంలో పాల్గొనాలని అలాగే స్వామివారి రథం మాడవీధులు రోడ్డు విస్తరణకు ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారములు ఉంటాయని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి రితీష్ కుమార్ రెడ్డి వారి కుమారుల పేరిట రెండు లక్షల రూపాయలు డొనేట్ చేసి ఈ యొక్క మాస కళ్యాణంనకు శాశ్వత ఉభయదారులుగా ఉంటాము అని హామీ ఇవ్వడం జరిగినది.

## ఫలించిన మంత్రి అచ్చెన్న కృషి



- నిమ్మాడలోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి 50 లక్షలు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- టెక్కలి నియోజకవర్గంలోని తక్కువ ఆదాయం కలిగిన 7 దేవాలయాలకు నెలకు 10 వేలు మంజూరు
- హర్షం వ్యక్తం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి (జర్నలిస్ట్ ఫైల్) : టెక్కలి నియోజక వర్గంలో తక్కువ ఆదాయంతో నడుస్తున్న దేవాలయాలకు ఆర్థిక తోడ్పాటు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి ఫలించింది. తొలివిడతగా నియోజకవర్గంలోని 7 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం క్రింద నెలకు 10 వేల రూపాయలను మంజూరు చేస్తూ దేవదాయ ధర్మదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా దేవాలయాలలో ప్రతిరోజు ధూపదీప నైవేద్య కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తూ, సేవలు చేస్తున్న అర్చకులకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ఉద్దేశించి ఈ నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. శ్రీ భ్రమరాంభిక మల్లిఖార్జున స్వామి దేవాలయం (కురుడు) , శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం (తిలారు), శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం (హరిదాశపురం), శ్రీ మల్లేశ్వర స్వామి దేవాలయం (డీఎల్ పురం), శ్రీ ఉమాకౌలి రామలింగేశ్వర స్వామి దేవాలయం (బోరభద్ర), శ్రీ భమరాంభిక మల్లిఖార్జున స్వామి దేవాలయం (సనివాడ), శ్రీ ఉమా సహిత నీలకంఠేశ్వర స్వామి దేవాలయం (నందిగామ) దేవాలయాలకు నెలకు 10 వేల రూపాయలు అందనున్నాయి.

**నీలకంఠేశ్వర దేవాలయ అభివృద్ధికి 50 లక్షలు మంజూరు**

కోటబొమ్మాళి మండలం, నిమ్మాడ గ్రామంలోని శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి దేవాలయం ఆలయ పునరుద్ధరణ పనుల నిమిత్తం సర్వశ్రేయోనిధి నుండి 50 లక్షల రూపాయలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మంజూరు చేశారు. ఆలయ నిర్మాణంలో అధికారులకు తగిన సూచనలను, సలహాలు ఇస్తూ త్వరితగతిన పుననిర్మాణం పూర్తయ్యేలా చూడాలని మంత్రి అచ్చెన్నాయుడుని కోరారు. దేవాలయాలకు ఆర్థిక తోడ్పాటును ఇవ్వడం, ఆలయ పుననిర్మాణంకు నగదును మంజూరు చేయడం పట్ల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. పురాతన కాలం నుండి ఈ దేవాలయాలు ఉన్నాయని వాటి అభివృద్ధి ధ్యేయంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## శ్రీశైలంలో పంచమఠాలలో విశేష పూజాదికాలు



- లోకకల్యాణార్ధం జరిగిన ప్రత్యేక అభిషేకాలు, పుష్పార్చనలు

శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) : లోకకల్యాణార్థం శ్రద్ధాభక్తులతో శ్రీశైలంలోని పంచమఠాలలో సోమవారం ఉదయం విశేష పూజాదికాలు నిర్వహించబడ్డాయి. ఘంటామఠం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం వరుసగా భీమశంకర మఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో సంప్రదాయబద్ధంగా సాగింది. పూజాకార్యక్రమం ప్రారంభంలో అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్ని పఠించారు. దేశంలో శాంతి, సంపదలు నెలకొనాలని, ప్రకృతి విపత్తులు దరిచేరకుండా, సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని, అకాల మరణాలు, ప్రమాదాలు నివారించబడాలని సంకల్పంలో ఉద్దేశించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజలు నిర్వహించి, కార్యక్రమం నిర్భంధంగా కొనసాగాలని ప్రార్థించారు. అన్ని మఠాలలో సంప్రదాయంగా అభిషేకాలు, పుష్పార్చనలు, అర్చనలు నిర్వహించబడ్డాయి. మఠాల శాంతిమయ వాతావరణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. శ్రీశైలంలోని మఠాలు చరిత్రాత్మకంగా ఆలయాల సమాంతరంగా నిర్మించబడి 7వ శతాబ్దం నుంచి కీలక పాత్ర పోషిస్తున్నాయి. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం వంటి భాగాలతో మఠాలు ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. భక్తులకు ఆధ్యాత్మిక సేవలందించడంలో, క్షేత్ర శాంతతను నిలుపుకోవడంలో మఠాల పాత్ర అపూర్వమైనది. కాలానుగుణంగా కొన్ని మఠాలు శిథిలావస్థకు చేరినా, దేవస్థానం వాటిలో మూడు మఠాలను ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలిని కాపాడుతూ చేపట్టిన ఈ పునర్నిర్మాణాలు దర్శనార్థుల్ని ఆకట్టుకుంటున్నాయి. అదేవిధంగా భీమశంకరమఠానికి మరమ్మతులు జరిపి పునఃప్రయోజన పరచినట్లు దేవస్థానం వెల్లడించింది. ప్రస్తుతం ఈ మఠాల్లోని దేవతామూర్తులకు నిత్యంగా ధూపదీప నైవేద్య సేవలు నిర్వహించబడుతున్నాయి. పంచమఠాల ద్వారా శ్రీశైల క్షేత్ర మహాత్మ్యం మరింత విస్తరిస్తుందని భక్తులు పేర్కొంటున్నారు.

## కామ్రేడ్ వి.ఎస్. అచ్యుతానందన్ మృతికి సీఐటీయూ సంతాపం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ వి.ఎస్. అచ్యుతానందన్ (101) మరణం పట్ల సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు సంఘటన నేపథ్యంలో సానుభూతి తెలిపారు. ఉద్యమ నాయకుడిగా వి.ఎస్. అచ్యుతానందన్ కార్మికులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం సాగిన పోరాటాలకు ముందు వరుసలో నిలిచారని, కేరళలో కమ్యూనిస్టు పార్టీ స్థాపన, బలోపేతంలో కీలక పాత్ర పోషించారని సీఐటీయూ నేతలు తెలిపారు. 1964లో సీపీఐ(యం) ఏర్పాటు చేసిన 32 మందిలో ఆయన ఒకరై, పార్టీ నిర్మాణానికి జీవితాన్ని అర్పించిన నాయకుడని కొనియాడారు. ఆయన ఏడుసార్లు కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రెండు సార్లు ప్రతిపక్షనేతగా, 2006 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా ఆయన పాలనలో కార్మిక సంక్షేమానికి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆయన పలు ప్రజాసంఘాల సమావేశాల్లో పాల్గొని ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన మృతి దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలకు, కార్మిక ఉద్యమాలకు తీరనినష్టమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆర్టీసి ఆస్తులపై ప్రైవేటీకరణ యత్నాలు తక్షణం ఆపాలి

- ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం
- ఏపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్



విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) : ఆర్టీసి ఆస్తులను ప్రైవేటు రంగానికి అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని ఏపిపిటిడి (ఆర్టీసి) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు, ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసి హౌస్‌లో ఆర్టీసి చైర్మన్ మరియు విసి & ఎండీకి వినతిపత్రం అందజేసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. రాజధాని అభివృద్ధి పేరుతో నగరాల మధ్యభాగాల్లో ఉన్న విలువైన ఆర్టీసి స్థలాలను ప్రైవేటు వ్యాపారులకు అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రణాళికలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. విజయవాడలోని పాత బస్టాండ్ పరిధిలో గల గవర్నర్ పేట 2 డిపో స్థలాన్ని షాపింగ్ మాల్ నిర్మాణానికి కేటాయించి, బస్సు డిపోను గొల్లపూడి ప్రాంతానికి తరలించాలన్న యోచనను తక్షణమే ప్రభుత్వం విరమించు కోవాలన్నారు. అలాగే విద్యుత్ బస్సుల పేరుతో రాష్ట్రంలోని 19 డిపోలను రెండు దశల్లో ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించాలన్న యత్నం కూడా ఆర్టీసి భవిష్యత్తుకు హానికరమని విమర్శించారు. ప్రజలు విశ్వాసంతో అధికారంలోకి తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్టీసిని బలోపేతం చేస్తుందని, కొత్త బస్సులు కొనుగోలు చేస్తుందని, ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు ఇస్తుందని, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లిస్తుందని ఉద్యోగులు ఆశించారని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలు ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తున్నాయని చెప్పారు. గతంలోనూ, 2017లో తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో గవర్నర్ పేట డిపోల ప్రైవేటీకరణకు ప్రయత్నం చేయడమే కాకుండా, గన్నవరం విమానాశ్రయానికి సమీపంలో ఉన్న సుమారు 29 ఎకరాల విలువైన ఆర్టీసి ట్రైనింగ్ కళాశాల స్థలాన్ని ప్రైవేట్ ఐటీ సంస్థకు అప్పగించిన ఘటనను గుర్తు చేశారు. ఇది సంస్థ ఆస్తుల విలువను లాభదాయకంగా ఉపయోగించాల్సిన అవసరం ఉన్న సమయంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం నిజంగా ఆర్టీసిని బలోపేతం చేయాలను కుంటే బస్సుల సంఖ్యను పెంచి, స్వంతంగా కొత్త బస్సులు కొనుగోలు చేసి, విలువైన ఆస్తులను కాపాడుతూ, ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసి, ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసిని ప్రైవేటు చేతుల్లోకి అప్పగించకుండా సంరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, దీనిలో ఉద్యోగుల వాదనను ప్రభుత్వ యంత్రాంగం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం.డి. ప్రసాద్, ఎం.డి.ఏ. సిద్దిక్, టి.వి. భవాని, ఎం. శంకరరావు, మొహిద్దీన్, చక్రవర్తి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి పోలీస్ శాఖ నిబద్ధత



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం లక్ష్యంగా "ప్రజా ఫిర్యాదులు – పరిష్కారాల వ్యవస్థ" కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను ఎస్పీ సతీష్ కుమార్ తదితర పోలీసు అధికారులు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కరించడమే శాఖ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి న్యాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా ముఖాముఖీ మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో వెంటనే ఫోన్ ద్వారా చర్చించారు. అదనపు ఎస్పీ (క్రైంస్) సుప్రజ, మహిళా పోలీస్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వారు కూడా ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించడంతో పాటు, ఫిర్యాదుదారులకు ధృవీకరణ పత్రాలు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు సుప్రజ (క్రైంస్), ఏటీవీ రవికుమార్ (శాంతి భద్రతలు), ఏ హనుమంతు (ఆర్మ్‌డ్ రిజర్వ్), మహిళా డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పీజీఆర్సీ సీఐ బిలాలుద్దీన్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసులకు తెలియజేసేందుకు ఇది మంచి వేదికగా నిలుస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## చట్ట ఉల్లంఘనకు కఠిన చర్యలు తప్పవు: డాక్టర్ అన్నపూర్ణ

- గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై తెనాలిలో సలహా సంఘం సమావేశం



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) : గర్భస్థ శిశు లింగ నిర్ధారణపై నిషేధిత పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై అవగాహన కల్పిస్తూ తెనాలి ఉపజిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ అధ్యక్షతన సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ సలహా సంఘ సమావేశం సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు తెనాలి కొత్తపేటలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు లింగ నిర్ధారణకు సంబంధించిన ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ఇస్తే లేదా నిబంధనలు ఉల్లంఘిస్తే, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. చట్టం ఉల్లంఘనకు తొలిసారి మూడేళ్ల జైలుశిక్ష, రూ. 50,000 జరిమానా, అలాగే వైద్య మండలి ధ్రువీకరణ పత్రం ఐదేళ్లపాటు రద్దు అవుతుందని తెలిపారు. రెండవసారి కూడా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే, ఐదేళ్ల జైలుశిక్ష, రూ. 1,00,000 జరిమానాతో పాటు వైద్య ధ్రువీకరణ పత్రం శాశ్వతంగా రద్దు చేయబడుతుందని హెచ్చరించారు. ఆడపిల్లల ఆవశ్యకతను తెలియజేస్తూ, "ఈ రోజుల్లో ఆడపిల్లలు వైద్య, పారిశ్రామిక, అంతరిక్ష రంగాల్లో సైతం అత్యుత్తమంగా రాణిస్తున్నారు. మగబిడ్డలతో సమానంగా వారు ప్రతిభను చాటుతున్నారు. అందువల్ల ప్రతి తల్లిదండ్రులు ఆడపిల్లలను తక్కువగా చూడకూడదు" అని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వినీల్, డాక్టర్ సురేష్, డాక్టర్ మానస, డాక్టర్ వేముల ప్రియాంక, రెడ్ క్రాస్ సంస్థ నుండి ముమ్మనేని భానుమతి, పెనుగొండ వెంకటేశ్వరరావు, నాళం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొని తమ సూచనలు, సలహాలు అందజేశారు.

## బీజేపీ గుంటూరు జిల్లా నూతన పదాధికారుల నియామకం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన పదాధికారులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని, కేంద్ర ప్రభుత్వ పథకాల విజయాలను ప్రజలకు చేరువ చేయడంలో పార్టీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. గ్రామ, మండల స్థాయిలో బీజేపీని మరింత శక్తివంతంగా తయారు చేయడానికి ఈ పదాధికారుల నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. తిరుపతిరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎక్కువ మంది ప్రజా ప్రతినిధులను తయారుచేయడం లక్ష్యంగా పనిచేయాలని నూతనంగా నియమితులైన పదాధికారులకు పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలకు కట్టుబడి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించాలని ఆయన సూచించారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులుగా మంత్రి సుగుణ, సాధు రామకృష్ణ, వంగిపురపు విమలాదేవి, రెడ్డి శివ పార్వతి, కటారి వాసుదేవ నాయుడు, కత్తి మేరీ సరోజినిలను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా హెచ్. రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యదర్శులుగా పంచమర్తి ప్రసాద్, ఆర్. వెంకటలక్ష్మి, మార్తా నరేంద్ర, నారదాసు వీరమణింద్ర, కె. నారాయణ రెడ్డి, సురేష్ కుమార్ జైన్, దానబోయిన శివయ్యలకు బాధ్యతలు అప్పగించారు. కోశాధికారిగా ఆమతి వెంకటరమణ నియమితులయ్యారు. ఐటీ కన్వీనర్‌గా కటకం అనూష, సోషల్ మీడియా కన్వీనర్‌గా తూనుగుంట్ల రాజేష్ బాధ్యతలు స్వీకరించారు. పార్టీ కార్యకలాపాలకు కొత్త శక్తిని అందించేందుకు ఈ కొత్త బృందం చురుకుగా పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇన్‌సర్వీస్‌లో బీఈడీ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల జీతాలు నిలిపివేతపై ఆప్టా ఆగ్రహం

- వెంటనే జీతాల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరిన ఆప్టా నేతలు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : విద్యాశాఖ అనుమతితో ఇన్‌సర్వీస్‌లో బీఈడీ కోర్సు చేస్తున్న ఎస్సీ మరియు ఎస్టీ కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయుల జూన్, జూలై నెలల జీతాలు నిలిపివేయడంపై ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ కోర్సు చేస్తున్న ఉపాధ్యాయుల పనిపోస్టులను ఖాళీలుగా చూపడంతో మండల విద్యాధికారులు వారి జీతాలను ఆపిన పరిస్థితి నెలకొంది. ఇది ఆర్థికంగా బలహీనమైన వర్గాల ఉపాధ్యాయులకు తీవ్రంగా మట్టికరిపించే విధంగా ఉందని ఆప్టా నేతలు అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జి.ఎస్. గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్ బీఈడీ కోర్సు చేయడం ఉద్యోగ విధులకు విరుద్ధం కాదనీ, ఇది వారి సేవా ప్రమోషన్‌కు అవసరమైన అర్హత అని స్పష్టం చేశారు. జీతాల ఆపివేత ఉపాధ్యాయుల జీవనంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందనీ, దీనిని ఆర్థిక వివక్షగా పరిగణించాలని ఆప్టా అభిప్రాయపడింది. ప్రభుత్వ, విద్యాశాఖ అధికారులు కలిసి తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని, బాధిత ఉపాధ్యాయుల జీతాలను చెల్లించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు ఉపాధ్యాయుల్లో అసంతృప్తికి దారితీసే అవకాశం ఉన్నందున, సమస్యలను సత్వరంగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ఆప్టా నేతలు స్పష్టం చేశారు.

## గ్రామీణ భారత్ అభివృద్ధికి పునరంకితం కావాలి

- ఘనంగా నాబార్డ్ 44వ వ్యవస్థాపక దినోత్సం
- ప్రతి రంగంలోను నాబార్డు మార్కు కనిపిస్తుంది
- బాబు ఏ, కమిషనర్ ఆఫ్ కోఆపరేషన్ మరియు రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీలు & రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్



విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) : గ్రామీణాభివృద్ధి మరియు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో నాబార్డ్ ప్రధాన పాత్ర పోషిస్తుందని కమిషనర్ ఆఫ్ కోఆపరేషన్ మరియు రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీలు & రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ తెలిపారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నాబార్డ్ 44 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ కోఆపరేషన్ మరియు రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీలు మరియు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు ఏ మాట్లాడుతూ గ్రామీణ భారత దేశ అభివృద్ధిలో ప్రతి దశలోను నాబార్డు సహకారం ఉందని తెలిపారు. సహకార రంగాన్ని ఆధునీకరించడంలో మరియు డిజిటలైజేషన్‌లో చేసిన సహకారాన్ని కొనియాడారు. 26 జిల్లాలన్నింట్లో సహకార సంస్థల బలోపేతం కోసం మరింత సమన్వయం అవసరమని ఆయన అన్నారు. దేశంలోను, రాష్ట్రంలోను ప్రతి రంగంలోను అభివృద్ధికి నాబార్డు సహకారం తప్పనిసరిగా ఉంటుందన్నారు. అమరావతి రాజధానిలో నాబార్డు కేంద్ర కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిందన్నారు. దేశ జీడీపీ కి వ్యవసాయ రంగం నుంచి ఎక్కువ మొత్తంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వస్తుందన్నారు. నా కెరీర్ మొదట్లో నేను నాబార్డు లో మేనేజర్ గా భోపాల్ లో జాయిన్ అయ్యానన్నారు. తదనంతరం సివిల్ సర్వీస్ కు రావడం జరిగిందన్నారు. గ్రామీణ భారతావని నిర్మాణానికి నాబార్డు ఎన్నో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటరీకరిణతో ముందుకు వెళ్లడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో ఈ–ఆడిటింగ్ చేసే దిశగా వెళ్లే అవకాశాలున్నాయన్నారు.

నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయ ప్రధాన మేనేజర్ శ్రీ ఎం.ఆర్. గోపాల్ మాట్లాడుతూ 1982 లో పార్లమెంట్ యాక్ట్ ద్వారా నాబార్డు ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2024%–%25 ఆర్థిక సంవత్సరంలో నాబార్డ్ సాధించిన అభివృద్ధిని విజయాలను వివరించారు. ఆర్థిక సంవత్సరంలో మొత్తం ? 42,842 కోట్ల రుణాలను మంజూరు చేసిందన్నారు. నాబార్డ్ రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాలు, సంస్థల అభివృద్ధికి మద్దతు ఇచ్చిందన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నంద్యాల జిల్లాల్లో కొత్త డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ (%ణణవీ%) కార్యాలయాలు ప్రారంభించిందన్నారు. దీంతో నాబార్డ్ ప్రాంతీయంగా మరింత బలోపేతం అయ్యిందన్నారు. ప్రాథమిక సహకార సంఘాల కంప్యూరీకరణ దిగ్విజయంగా ముందుకు వెళ్ళతుందన్నారు. ఈ ప్రక్రియ మొత్తం దేశానికే మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఆర్బీఐ, ఎస్ఎల్బీసీ, ఏపీజీబీ నాబార్డు కి ఇస్తున్న సహకారాన్ని ఆయన కొనియాడారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ ఏ.ఓ. బషీర్ (ఆంధ్రప్రదేశ్) మాట్లాడుతూ నాబార్డ్ సహకార బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంలో చేసిన పాత్రను ఆయన ప్రశంసించారు. ఎస్ఎల్బిసి కన్వీనర్ సి.వి.ఎన్. భాస్కర్ రావు మాట్లాడుతూ బ్యాంకుల మధ్య మెరుగైన సమన్వయానికి పిలుపునిస్తూ, ఆర్థిక సహకారాన్ని పెంచడంలో నాబార్డ్ పట్ల ఉన్న కృతజ్ఞతను ఆయన తెలియజేశారు. ఆప్ కాబ్ ఎండీ డా. ఆర్. శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ నాబార్డ్ అందించిన మూలధన మద్దతు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, మరియు పీఏసీఎస్ అభివృద్ధి ని వివరించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ వేతనదారులకు మరియు బ్యాంకింగ్ వ్యవస్థకు నాబార్డ్ అందించిన రుణ సదుపాయాలను ఆయన తెలిపారు. Roots of Change అనే షార్ట్ డాక్యుమెంటరీ విడుదల చేశారు. ఈ డాక్యుమెంటరీ ద్వారా కాకినాడ మరియు కోనసీమ జిల్లాల్లో నాబార్డ్ అందించిన సమగ్ర గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలను అందించారు.. అలాగే NIDHI (నిధి) పత్రిక, మరియు AFECOLOGY ద్వారా అమలు చేసిన వాటర్ షెడ్ ప్రాజెక్టుల కేస్ స్టడీలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నాబార్డ్ భాగస్వామ్యంలో పనిచేసిన PACS,FPOs, NGOs లు తమ అనుభవాలను పంచుకున్నారు. విశేషంగా సేవలందించిన %ూాజూ, ణజజదీం% మరియు స్టాల్ నిర్వాహకులను నాబార్డ్ అధికారులు సత్కరించారు. తొలుత స్వాగత ప్రసంగంలో నాబార్డ్ ప్రధాన మేనేజర్ డా. కె.వి.ఎస్. ప్రసాద్ నాబార్డ్ అభివృద్ధి లక్ష్యాల పట్ల ఉన్న నిబద్ధతను వివరించారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, సహకార సంస్థలకు చెందిన వారు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467